


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 103 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 05 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### భోగాపురం ఎయిర్‌పోర్టుతో

# ఉత్తరాంధ్ర దశ-దిశ మారుతోంది



### తొలి విమానం ల్యాండింగ్ విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి విమానం ల్యాండింగ్ విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. '2014 – 2019 మధ్య కాలంలో ఈ విమానాశ్రాయ నిర్మాణం ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టింది. ఈ ఏడాది జూన్ నాటికి మిగిలిన 4 శాతం పనులు కూడా పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. గడిచిన 18 నెలల్లో విమానాశ్రయ పనులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి రావడానికి కారణమైన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి ధన్యవాదాలు. భోగాపురం ఎయిర్ పోర్టు ఆ ప్రాంత కనెక్టివిటీ పెంచి అభివృద్ధికి దోహద పడుతుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, నేషనల్ హైవేలు, ఐటీ సహా వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ సంస్థల రాకతో ఉత్తరాంధ్ర దశ దిశ మారబోతోంది. అన్ని ప్రాంతాల సమగ్రఅభివృద్ధికి సంకల్పంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం కోరుకుంటూ....ఈ శుభసందర్భాన ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నా" అని మిగతా .. 2లో..

### ఒలింపిక్స్-2036 నిర్వహణకు

## భారత్ సన్నద్ధమవుతోంది : ప్రధాని మోదీ



**వారణాసి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒలింపిక్స్–2036 క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని మిగతా .. 2లో..

## ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు..



### అస్సాం స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియామకం

**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది అస్సాంలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఆమెను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రియాంక కమిటీలో లోకసభ ఎంపీలు ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలకతో పాటు మిగతా .. 2లో..

### ప్రమాద ఘటనపై రెండు రోజుల్లో

## పూర్తిస్థాయి నివేదిక అందజేయాలి : హోం మంత్రి అనిత



**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాంబిల్లి మండలం, అచ్యుతాపురం, ఎపిఎస్ఇ జడ్‌లో ఎస్‌విఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ వద్ద అగ్ని ప్రమాద సంఘటన పై రెండు రోజుల్లో పూర్తిస్థాయినివేదిక అందజేయాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను అదేశించారు. ఆదివారం ఉదయం ఎపిఎస్ఇ జడ్‌లో ఎస్‌విఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ వద్ద అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని హోం మంత్రి అనిత, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ పరిశీలించారు. హోం మంత్రి అనిత ప్రమాదం ఎలా జరిగిందో కంపెనీ ప్రతినిధులను, అధికారులను మిగతా .. 2లో..

## భోగాపురం విమానాశ్రయంలో ల్యాండ్ అయిన తొలి విమానం

**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అయింది. వ్యాలిడేషన్ (టెస్ట్) ఫ్లైట్ దిల్లీ నుంచి భోగాపురం వచ్చింది. ఈ విమానంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఏటీసీ ఛైర్మన్ తదితరులు ఉన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. 96 శాతం ప్రాజెక్టు నిర్మాణం అయినట్లు జీఎంఆర్ సంస్థ తెలిపింది. జూన్ 26న ప్రారంభించనున్నారు. విమానం ల్యాండ్ అయిన సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. "ఎయిర్‌పోర్టు అంటే 2 వేల ఎకరాల్లోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాత్రమే కాదు. విశాఖ ఎకనామిక్ రీజియన్ బలపడడానికి అవకాశం




సాధించాం. మరో నాలుగైదు నెలల్లో విమానాశ్రయం ప్రారంభించేందుకు సంకల్పం తీసుకున్నాం. విమానాశ్రయానికి సంబంధించి కీలక అంశాలన్నీ పూర్తయ్యాయి. టెస్ట్ ఫ్లైట్ ల్యాండ్ అయిందంటే ప్రాజెక్టు చివరి దశ. అన్నీ పూర్తిచేసినట్లు సంకేతం. ఈ ప్రాజెక్టుతో వివిధ జిల్లాల ప్రజలు అనుసంధానం మిగతా .. 2లో..

### భాష, వారసత్వం, సంస్కృతి వల్లే

## మన సంబంధాలు బలోపేతం

### మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల్లో తెలుగు మాట్లాడేవారు ఉన్నారంటే అతిశయోక్తి కాదని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తెలిపారు. మహాసభలు భాష, నాగరికతను మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిర్వహించుకునే విధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "తెలుగు రాష్ట్రాల్లో ఉగాది పండుగకు ఎంత ప్రాముఖ్యం ఉంటుందో, మారిషస్‌లో కూడా అంతే మిగతా .. 2లో..

### సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను

## ఖండించిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిపివేయించానన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. తెలంగాణ ప్రయోజనాల కోసం పనులు నిలిపివేశారన్న రేవంత్ వ్యాఖ్యలను తప్పుపట్టింది. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమని పేర్కొంది. చంద్రబాబు కేంద్రంగా తెలంగాణలో అధికార, విపక్షలు రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించింది. ఏపీ నీటి హక్కులు, సీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ ఉండబోదని తెలిపింది. "జగన్ హయాంలో అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు చేపట్టారు. సీమకు రోజుకు 3 టీఎంసీలంటూ మిగతా .. 2లో..

### దిల్లీ పేలుడు కేసు..

## 'ఘోస్ట్ సిమ్'తో ఉగ్ర కార్యకలాపాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీ పేలుడు కేసులో 'జాతీయ దర్యాప్తు సంస్థ' విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఉగ్రకుట్రలో కీలక నిందితులు అయిన వైద్యులు పాకిస్థానీ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి 'ఘోస్ట్ సిమ్' కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ మెసేజ్ యాప్‌లను ఉపయోగించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో పాటు ఇతర నిందితులు రెండు మూడు ఫోన్లను వినియోగించినట్లు తెలిపారు. వారి పేర్లతో రిజిస్టర్ అయిన సిమ్‌లతో పాటు.. నకిలీ ఆధార్ కార్డులను ఉపయోగించి తీసుకున్న వాటిని కూడా ఉపయోగించేవారని అన్నారు. పాకిస్థాన్‌కు చెందినవారితో మాట్లాడడానికి వీటిని వినియోగించేవారని తెలిపారు. ఫోన్‌లో సిమ్ లేకపోయినా మెసేజ్‌లు పంపేందుకు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా ఉపయోగించేవారని చెప్పారు. వీటిద్వారానే హ్యాండ్లర్ల నుంచి ఐఈడీల మిగతా .. 2లో..

## మనిషి బరువులో సగం డిస్కౌంట్..

### వస్త్ర దుకాణంలో వినూత్న రాయితీ



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** వస్త్రాలపై ప్రస్తుతం సంక్రాంతి పండగ నేపథ్యంలో పలు దుకాణదారులు వివిధ రూపాల్లో వినియోగదారులకు డిస్కౌంట్‌లు, ఆఫర్లు ఇస్తుంటారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 10 శాతం, 20 శాతం, 30 శాతం అంటూ డిస్కౌంట్ ఇచ్చారు. అయితే తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో మిగతా .. 2లో..

## వణుకు పుట్టించే న్యూస్..



### మరోసారి పంజా విసరనున్న చలి..

**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత మళ్లీ పెరుగుతుందని తెలంగాణ వెదర్‌మ్యాన్ బాలాజీ హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు డిసెంబర్ స్థాయికి పడిపోతాయి. ఉదయం దట్టమైన పొగమంచు, మబ్బులు ఆవరించనున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఉన్ని దుస్తులు ధరించి, శ్వాస సమస్యలున్నవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రయాణాల్లో పొగమంచు లైట్లు వాడాలని సూచించారు. చలి ఏ రోజుల్లో ఎక్కువగా ఉంటుందంటే..? గత కొద్ది రోజులుగా చలి నుంచి మిగతా .. 2లో..

## టార్గెట్ మదురో

### ఆ రాత్రి దాడికి .. ఆగస్టు నుంచే ప్లానింగ్..



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా స్పెషల్ కమాండోలు వెనెజువెలాలోని కారకాస్‌లో చేపట్టిన ఆపరేషన్ ఆధునిక సైనిక చరిత్రలో గుర్తుండిపోతుంది. దీనికోసం అగ్రదేశ వ్యూహకర్తలు చాలా నెలల ముందే ప్రణాళిక సిద్ధం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉత్తరాంధ్ర దశ - దిశ మారబోతోంది

చంద్రబాబు పోస్టు పెట్టారు

**ఉత్తరాంధ్రకు కొత్త రెక్కలు: మంత్రి లోకేశ్**

"భోగాపురానికి వాలిడేషన్ ఫ్లైట్ రాకతో ఉత్తరాంధ్రకు కొత్త రెక్కలు వచ్చినట్లు అయింది. ఆ ప్రాంత అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుంది. కనెక్టివిటీ పెరుగుదల సహా ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి ఇది బలమైన పునాది. ఈ ప్రాజెక్టుకు దూరదృష్టితో మార్గనిర్దేశం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. ఈ ఏడాది జూన్ నుంచి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధం కానుంది" అని లోకేశ్ వెల్లడించారు.

**గేమ్ ఛేంజర్: బీసీ జనార్దన్ రెడ్డి**

"భోగాపురం విమానం ల్యాండింగ్ ఏపీ అభివృద్ధిలో గేమ్ ఛేంజర్. వాలిడేషన్ ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషకరం. రాష్ట్ర విమానాయానరంగంలో ఇది చరిత్రాత్మక ఘట్టం. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్టు ఎంతో దోహదపడుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో ఉత్తరాంధ్ర రూపు రేఖలు మారతాయి" అని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.

ఒలింపిక్స్-2036 నిర్వహణకు

# భారత్ సన్నద్ధమవుతోంది : ప్రధాని మోదీ

గుర్తుచేశారు. అండర్ – 17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ ఆటతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరి వల్ల సాధ్యం కాదనే విషయాన్ని ఈ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రియాంక గాంధీకి కీలక బాధ్యతలు..

సిరివెల్ల ప్రసాద్‌ను సభ్యులుగా నియమించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారు, ఎన్నికల ముందు జరగాల్సిన అంతర్గత సంప్రదింపులు వంటివి ఈ కమిటీ నిర్వహించనుంది. ఇక, పశ్చిమ బెంగాల్, కేరళ. తమిళనాడు పుదుచ్చేరిలకు కూడా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## పూర్తిస్థాయి నివేదిక అందజేయాలి : హోం మంత్రి అనిత

అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సంఘటనపై కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసారు.కంపెనీలో పరిమితికి మించి కెమికల్స్ నిల్వ చేయడంపై కంపెనీ ప్రతినిధులను ప్రశ్నిస్తూ, ప్రమాదానికి గల కారణాలపై రెండు రోజుల్లో పూర్తిస్థాయినివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ నిన్న దురదృష్టకరమైన సంఘటన జరిగిందని, ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు తక్షణమే స్పందించారని, ఫైర్ సేఫ్టీ అధికారులు ప్రమాద ఘటన స్థలానికి వెంటనే చేరుకొని మంటలు అదుపు చేయడం జరిగిందన్నారు.అధికారులు, స్థానిక ఎమ్మెల్యే హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షంచారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, సంఘటనకు బాధ్యులైన కంపెనీ ప్రతినిధులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఎవరిని ఉపేక్షంచేది లేదని మంత్రి తెలిపారు.

# ల్యాండ్ అయిన తొలి విమానం

అవుతారు. గతంలో ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు మొదలు పెట్టడమే కానీ పూర్తవుతాయో తెలియని పరిస్థితి. విమర్శలకు సమాధానంగా విమానాశ్రయం నిర్మించాం. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు కేంద్ర బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపు చేపట్టారు. మన ప్రాంత అభివృద్ధికి కేంద్ర సహకారం తీసుకుంటున్నాం" అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# మన సంబంధాలు బలోపేతం

ప్రాముఖ్యం ఉంది. అక్కడి ప్రజలు కూడా ఎంతో వైభవంగా ఉగాదిని నిర్వహించుకుంటారు. ఈ పండగనాడు మారిషస్‌లో సెలవు దినం. పలు నాగరికతల మధ్య విభిన్న క్యాలెండర్లు ఉండవచ్చు గానీ, ప్రాథమిక సూత్రం మారదు. కొత్త ఆరంభాలను నిరంతరం దూరదృష్టితో మలచడం మన సమష్టి బాధ్యత. ఈ మహాసభ నిర్వహణ ఆంధ్ర సారస్వత పరిషత్తు దూరదృష్టికి నిదర్శనం. మీరు తెలుగు భాష, సంస్కృతిని ప్రాంతీయ వారసత్వాన్ని ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిపారు. తెలుగు.. భారత్‌లో మూడో అత్యధిక మంది మాట్లాడే భాషగా ఉంది. తెలుగు భాష, సంస్కృతి ప్రవాసుల అంతర్భాగంలో ఉంది. ఇది రెండు దేశాలను కలిపే శాశ్వతమైన ప్రజా సాంస్కృతిక బంధాలను తెలుపుతుంది. ఈ మహాసభ తెలుగు ప్రవాసుల గుర్తింపును తెలియజేస్తోంది. ఇది ఖండాల మధ్య అనుసంధాన్ని పెంపొందిస్తోంది. ఈ మహాసభల్లో జరిగిన చర్చల ఫలితాలు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు గుర్తింపును బలపరుస్తాయి. అర్థవంతమైన తోడ్పటు అందిస్తాయన్నారు. భారత్, మారిషస్‌ల మధ్య సంబంధం ఉమ్మడి చరిత్ర, విలువలతో కలిగి ఉంది. తమ పూర్వీకులు భారత పుణ్యభూమి నుంచి వచ్చి భాషలను పరిరక్షంచారు. సంప్రదాయాలను కాపాడి తరతరాల పాటు వాటిని కొనసాగించారు. 2025 మార్చిలో భారత ప్రధాని మోదీ మారిషస్‌ను సందర్శించడం, ఆ తర్వాత మా దేశ ప్రధాని భారత్‌ను సందర్శించడంతో మా భాగస్వామ్యం ఎంతో పురోగతి సాధించింది. అధికారక రాజనీతికి మించి ఇరుదేశాల మధ్య సంబంధాలను నిలబెట్టేది ప్రజల అనుబంధమే. భాష, వారసత్వం, సంస్కృతి ఇరుదేశాల సంబంధాలను కలుపుతున్నాయి" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ధరమ్ బీర్ గోకుల్‌కు ఆంధ్ర సారస్వత పరిషత్ భారతమిత్ర అవార్డు ప్రకటించింది. మారిషస్ అధ్యక్షుడికి ఉత్తరాఖండ్ ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి, గజల్ శ్రీనివాస్ అవార్డు అందించారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను

# ఖండించిన ఏపీ ప్రభుత్వం

ప్రకటనలతో జగన్ ప్రభుత్వం పనులు చేపట్టింది. జగన్ ప్రచారంతో లిఫ్ట్ పనులపై తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసులు వేసింది. కేంద్రం, ఎన్‌జీటీతో పాటు పలుచోట్ల ఫిర్యాదు చేసింది. తెలంగాణ ఫిర్యాదులను విచారించి.. అనుమతులు లేనందున పనులు నిలిపివేయాలని 2020లోనే ఎన్‌జీటీ, కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే కేంద్రం పనులను నిలిపివేయించింది" అని ఏపీ ప్రభుత్వం తెలిపింది.

**ఏమైందంటే..**

అసెంబ్లీలో కృష్ణానదీ జలాలపై శనివారం నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "వైఎస్ జగన్‌కు పంచభక్ష పరమాన్నాలు పెట్టి.. కేసీఆర్ భుజం తట్టి ప్రోత్సహిస్తే.. నేను చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపించా. అదీ నా చిత్తశుద్ధి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆపండి.. అని అడిగితే మా మీద గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపించారు. ఆ పనులు ఆగాయో.. లేదో తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీని పంపించండి. చంద్రబాబు నాయకత్వంలో పనిచేసిన నేను.. ఆ నాయకత్వాన్ని, ఆ పార్టీని వదిలిపెట్టాను. అలాంటిది నేను తెలంగాణకు అన్యాయం చేస్తానా? మొదట నాకు తెలంగాణ. ఆ తర్వాతే పార్టీ. నాలాంటి వాళ్లు తెలంగాణ ప్రజల హక్కులను తాకట్టు పెడతారా? రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని కంకణం కట్టుకొని బయలుదేరా. కేసీఆర్ శాసనసభకు హాజరై ఏమైనా సూచనలు ఇస్తారని అనుకున్నా. మా ప్రభుత్వం ఆ సూచనలు పరిగణనలోకి తీసుకుటుందని చెప్పాం. అందుకే వారి డిమాండ్ మేరకు సమావేశం ఏర్పాటు చేసుకున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

దిల్లీ పేలుడు కేసు..

# 'ఘోస్ట్ సిమ్'తో ఉగ్ర కార్యకలాపాలు

తయారీ నేర్చుకునేవారన్నారు.

**ఏమిటీ ఘోస్ట్ సిమ్‌లు?**

అక్రమ కార్యకలాపాల కోసం ఇతరుల వివరాలను ఉపయోగించి, మోసపూరితంగా తీసుకునే సిమ్‌లను ఘోస్ట్ సిమ్‌లు అంటారు. ఇటువంటి నకిలీ సిమ్‌కార్డులను సైబర్ నేరగాళ్లు, ఉగ్ర హ్యాండ్లర్లు ఉపయోగిస్తుంటారు. ఫోన్‌లలో సిమ్ లేకుండా ఉపయోగించే ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా ఉగ్రవాదులు వినియోగిస్తుంటారు. కాగా ఇటువంటి ఉగ్రవాద, సైబర్ నెట్‌వర్క్‌లను నిరోధించడానికి గతేడాది నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. డివైజ్‌లో సిమ్ కార్డు ఉంటేనే యాప్ సర్వీసులు పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (ఐఓటీ) సూచించింది. ఈ నిబంధనల ప్రకారం.. యూజర్ ఏ సిమ్‌తో అకౌంట్ రిజిస్టర్ చేశారో.. అది ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది.

# మనిషి బరువులో సగం డిస్కౌంట్..

జీఎల్ఆర్ షాపింగ్ మాల్ వారు మనిషి బరువును బట్టి వినూత్నంగా డిస్కౌంట్ ఇస్తున్నారు. దుకాణంలో వెయింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. దుస్తులు ఎవరైతే కొనుగోలు చేస్తారో వెయింగ్ మిషన్‌పై వారి బరువును తూకం వేస్తారు. వారు ఉన్న బరువులో సగం డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇలా 70 కేజీల బరువున్నవారికి 35 శాతం, 80 కేజీలు ఉన్నవారికి 40 శాతం, 100 కేజీలు ఉన్న వారికి 50 శాతం వారు కొనుగోలు చేసిన దుస్తులపై డిస్కౌంట్ ఇస్తున్నారు. ఈ డిస్కౌంట్ వినూత్నంగా ఉండటంతో కొనుగోలు దారులు ఆసక్తి చూపుతున్నారు.

# వణుకు పుట్టించే న్యూస్..

స్వల్ప ఉపశమనం పొందుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలంగాణ వెదర్‌మ్యాన్ బాలాజీ షాకింగ్ అప్‌డేట్ ఇచ్చారు. డిసెంబర్‌లో వణికించిన చలి తీవ్రత మళ్లీ మొదలుకానుంది. జనవరి 5 నుంచి 12 వరకు రెండో విడత శీతల గాలులు బలంగా వీయనున్నాయని హెచ్చరించారు. రానున్న వారం రోజుల్లో వాతావరణం పూర్తిగా మారిపోనుంది. డిసెంబర్ నెలలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలకు సమానంగా ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉంది. సాధారణంగా ఎండ ప్రభావం ఉండే మధ్యాహ్న సమయాల్లో కూడా ఉష్ణోగ్రతలు కేవలం 25-26 డిగ్రీలకే పరిమితం కావచ్చు. ఉదయం పూట దట్టమైన పొగమంచు కమ్మేయనుంది. దీనివల్ల రహదారులపై విజిబిలిటీ తగ్గి వాహనదారులకు ఇబ్బందులు కలగవచ్చు. ఆకాశం పూర్తిగా మబ్బులతో నిండి ఉంటుంది. దీనివల్ల సూర్యరశ్మి తక్కువగా ఉండి రోజంతా చలి వాతావరణం కొనసాగుతుందని బాలాజీ తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా ఉన్ని దుస్తులు ధరించాలి. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు, చిన్న పిల్లలు, వృద్ధులు పొగమంచు సమయంలో బయటకు రాకపోవడమే మంచిది. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు వాహనదారులు ఫాగ్ లైట్లు వాడుతూ, తక్కువ వేగంతో ప్రయాణించాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుని చలి నుంచి సేఫ్‌గా ఉండండి.

# టార్గెట్ మదురో

చేసుకొన్నారు. కరేబియన్ సముద్రంలో మాటువేసి అదను చూసి దాడి చేసి నికోలస్ మదురోను అదుపులోకి తీసుకొన్నారు.

**చిన్న బృందాలుగా సీఐఏ గూఢచారులు.. డ్రోన్లతో రెక్కీలు..**

ఆగస్టులోనే అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి చెందిన గూఢచారుల చిన్న బృందం వెనెజువెలాలోకి ప్రవేశించింది. ఇది కారకాస్ చుట్టుపక్కల మదురో కదిలికలపై నిఘా వేసింది. మదురో కదలికలు బాగా తెలిసిన సన్నిహిత వ్యక్తి నుంచే సీఐఏ బృందం సమాచారం సేకరించింది. అదే సమయంలో ఓ స్టెల్త్ డ్రోన్ల దళం కూడా ఆ నగరంపై నిశ్శబ్దంగా సంచరిస్తూ.. మదురో తిరిగే ప్రదేశాలకు సంబంధించిన స్పష్టమైన మ్యాప్‌ను తయారు చేసింది. వెనెజువెలాలో అమెరికా దౌత్యకార్యాలయం కూడా లేకపోవడంతో.. సీఐఏ గూఢచారులకు ఈ మిషన్ పెనుసవాలే.

**కెంటకీలో మదురో కాంపౌండ్ నమూనా..!**

మరోవైపు డెల్టాఫోర్స్ కమాండోలు కూడా ఆపరేషన్ కోసం కెంటకీలోని స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్‌లో మదురో ఇంటి నమూనాను సృష్టించారు. దానిని ఆధారంగా చేసుకొని స్టీల్ డోర్లను అత్యంత వేగంగా బద్దలు కొట్టడాన్ని సాధన చేశారు. అయితే, ఇక్కడే అమెరికా దళాలకు ఓ చిక్కొచ్చి పడింది. అగ్ర రాజ్యంతో ఉద్రిక్తతల నేపథ్యంలో మార్చి మార్చి మదురో మొత్తం ఎనిమిది ప్రదేశాల్లో తిరుగుతున్నట్లు గుర్తించారు. ప్రతి రోజు సాయంత్రం వరకు అతడు ఎక్కడ ఉంటాడో కచ్చితంగా అమెరికా నిఘా వర్గాలు ఊహించలేకపోయాయి. డెల్టాఫోర్స్ సాధన చేసిన కాంపౌండ్‌లోనే అతడు ఉన్నట్లు ధ్రువీకరణ ఆపరేషన్‌కు తప్పనిసరిగా మారింది. అప్పటి వరకు అమెరికా స్పెషల్ ఆపరేషన్ విమానాలు, సాయుధ డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ విమానాలు, సెర్చ్ అండ్ రెస్క్యూ హెలికాప్టర్లు, ఫైటర్‌జెట్‌లు, ఇతర దళాలను వెనెజువెలా తీరానికి భారీ ఎత్తున తరలిస్తోనే ఉంది.

**మదురోకు పెద్దగా అనుమానం రాకుండా..**

ఏకంగా వెనెజువెలా అధ్యక్షుడిపైనే తాము గురిపెట్టిన విషయం ఎక్కడా అనుమానం రాకుండా.. అమెరికా చర్యలు తీసుకొంది. సముద్రంలో డ్రగ్స్ బోట్ల పేరిట వరుసగా దాడులు చేస్తూ.. 115 మందిని మట్టుబెట్టింది. గత వారం వెనెజువెలాలో ఓ పోర్టుపై సీఐఏ డ్రోన్ దాడి చేపట్టింది. అదే సమయంలో మదురో అమెరికా ప్రభుత్వంతో డీల్ కుదుర్చుకోవాలనుకొన్నా.. అది విఫలమైంది. దీంతో ఆపరేషన్ తప్పనిసరి అన్న విషయం తేలిపోయింది.

**డిసెంబర్‌లోనే ట్రంప్ నుంచి గ్రీన్ సిగ్నల్**

కారకాస్‌లో తాజాగా చేపట్టిన దాడికి సంబంధించి 2025 డిసెంబర్‌లోనే ట్రంప్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. అయితే.. ఎప్పుడు చేయాలనేది నిర్ణయించే అధికారం పెంటగాన్, స్పెషల్ ఆపరేషన్స్ ప్లానర్స్‌కు వదిలేశారు. ఆపరేషన్‌ను నూతన సంవత్సరం, క్రిస్మస్ సెలవుల సమయంలో నిర్వహించాలని తొలుత భావించారు. ఆ సమయంలో ఎక్కువ మంది సైనిక, ప్రభుత్వ సిబ్బంది వెకేషన్లు, లీవ్‌ల్లో ఉండటం కలిసొస్తుందని భావించారు. కానీ, చాలా సార్లు వాతావరణం అనుకూలించక వాయిదాపడింది. శుక్రవారం రాత్రి 10.46 నిమిషాలకు అధ్యక్షుడు ట్రంప్ నుంచి తుది ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి సాయంత్రం 4.30 సమయంలోనే అమెరికా దళాలు కొన్ని ఆయుధాలను తొలివిడతలో ప్రయోగించేందుకు ఆదేశాలు అందాయి. అమెరికా సైబర్ దళాలు వెనెజువెలాలోని కారకాస్‌లో విద్యుత్తు వ్యవస్థను దెబ్బతీసి ఉండొచ్చని ది పొలిటికో పత్రిక విశ్లేషించింది. ఈ దాడి వేళ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను గుర్తించకుండా ఈ చర్యలు చేపట్టి ఉండొచ్చని తెలిపింది. అమెరికా మాత్రం ఆ సమయంలో విద్యుత్తు నిలిచిపోవడానికి కారణాన్ని గోప్యంగా ఉంచింది.

**20 మిలిటరీ బేస్‌లు.. యుద్ధ నౌకల నుంచి..**

అమెరికా ఈ దాడి కోసం మొత్తం 20 బేస్‌లు, యుద్ధ నౌకల నుంచి 150 విమానాల దండును పంపించింది. వీటిల్లో ఫైటర్‌జెట్‌లు, బాంబర్లు, డ్రోన్లు ఉన్నాయి. ఈ దళాలు కారకాస్ వద్ద ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను ధ్వంసం చేశాయి. అయితే అర్ధరాత్రి 2.01 సమయంలో అమెరికా హెలికాప్టర్‌పై దాడి జరిగింది. దీనిలో డజను మంది సైనికులు గాయపడినట్లు ఆ దేశ సైనిక జనరల్ వెల్లడించారు.

**మదురో కోసం ప్రత్యేకంగా నైట్ స్టాకర్స్..!**

వెనెజువెలా అధ్యక్షుడిని బంధించి తరలించేందుకు మాత్రం 160వ స్పెషల్ ఆపరేషన్స్ ఏవియేషన్ రెజిమెంట్‌కు చెందిన యూనిట్ బయల్దేరింది. వీరు డెల్టాఫోర్స్ దళాల కోసం ప్రత్యేకంగా మార్పులు చేసిన ఎంహెచ్-60, ఎంహెచ్-47 హెలికాప్టర్లను నడిపారు. కేవలం హైరిస్క్ ఆపరేషన్ల కోసమే నైట్‌స్టాకర్స్‌ను అమెరికా వాడుతుంది. ఈ యూనిట్‌కే కొన్ని నెలల నుంచి ఏకంగా వెనెజువెలా తీరం సమీపంలోనే శిక్షణ ఇవ్వడం గమనార్హం.

**అగ్గి రాజేసింది చమురే!**

ఇక డెల్టా ఫోర్స్ కమాండోలు మదురో కాంపౌండ్‌లో దిగగానే.. అక్కడి ఆపరేషన్‌ను ఫ్లోరిడాలోని 'మార్ ఎ లాగో' ఎస్టేట్‌లో ట్రంప్ నేరుగా వీక్షంచడం మొదలుపెట్టారు. డెల్టా ఫోర్స్ కమాండోలు తొలుత పేలుడు పదార్థాలను వాడి కాంపౌండ్‌లోకి చొరబడ్డారు.

**సేఫ్ రూమ్‌లోకి వెళ్లక ముందే..**

అమెరికా కమాండోలు మదురో గదిలోకి ప్రవేశించగా.. ఆయన భార్యతో కలిసి ప్రత్యేకమైన స్టీల్‌రూమ్‌లోకి వెళ్లే యత్నం చేశారు. కానీ, అప్పటికే ఆ గదిపై పట్టు సాధించిన దళాలు మదురోను అడ్డుకొని అదుపులోకి తీసుకొన్నాయి. వాస్తవానికి ఆ స్టీల్ గది డోర్ చాలా భారీగా ఉండటంతో.. దానిని మూయడం మదురోకు కూడా సాధ్యం కాలేదని ట్రంప్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. ఆ కాంపౌండ్‌లోకి ప్రవేశించిన ఐదు నిమిషాల్లోనే మదురోను బంధించడం విశేషం. ఒక వేళ మదురో స్టీల్ రూమ్‌లో తనను తాను బంధించుకొంటే.. చర్చలు జరిపేందుకు ఎఫ్‌బీఐ హొస్టేజ్ నెగోషియేటర్‌ను కూడా డెల్టాఫోర్స్ తమ వెంట తీసుకొచ్చింది. కానీ, ఆ అవసరం రాలేదు. తెల్లవారుజామున 4.29 గంటలకు మదురో దంపతులను హెలికాప్టర్ ఎక్కించి యుద్ధ నౌక యూఎస్ఎస్ ఐవా జిమా వద్దకు తరలించారు. అక్కడి నుంచి గ్వాంటనామో బేలోని నౌకా స్థావరంలో ఉంచి 757 ప్రభుత్వ విమానంలో మదురో దంపతులను అమెరికాకు తరలించారు.

మద్యం మత్తులో వీరంగం..

# మచిలీపట్నం పోలీసుల వినూత్న శిక్ష



**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మందుబాబులకు పోలీసులు వినూత్న శిక్ష విధించారు. నడి రోడ్డుపై నడిపించుకుంటూ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి కొందరు మందుబాబులు మద్యం తాగి వీరంగం సృష్టించారు. పాదచారులపై దాడికి పాల్పడటమే కాకుండా సమీపంలోని సిటీ కేబుల్ ఆఫీస్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దృష్టికి వెళ్లడంతో.. దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోవాలని ఆర్‌పేట సీఐను ఆదేశించారు. దీంతో ఆదివారం సీఐ ఏసుబాబు వారిని అదుపులోకి తీసుకుని సిటీ కేబుల్ రోడ్ నుంచి కోనేరుసెంటర్ మీదుగా నడిపించుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. నిందితుల స్వస్థలమైన బలరామునిపేటలో కూడా రోడ్డుపై నడిపించారు. రౌడీమూకలు, తాగుబోతులు, గంజాయి బ్యాచ్‌కు ఈ శిక్ష హెచ్చరికగా ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# తర్వాత వంతు మీదే : ప్రత్యర్థి దేశాలకు ట్రంప్ వార్నింగ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలను హెచ్చరించారు. మెక్సికో, క్యూబా, కొలంబియా సైతం మాదకద్రవ్యాలను తయారు చేస్తూ.. అక్రమంగా అమెరికాలోకి సరఫరా చేస్తున్నాయని ఆరోపించారు. అనేక ముఠాలకు కూడా ఈ దేశాలు ఆశ్రయమిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తర్వాత వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాలలోని డ్రగ్స్ ఉత్పత్తి చేసే ప్రయోగశాలపై దాడులు చేయడానికి కూడా వెనుకాడనని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ..ఇతర దేశాల నుంచి అమెరికాకు సరఫరా అవుతున్న డ్రగ్స్‌ను కట్టడి చేయడమే తమ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విషయంలో వెనెజువెలా తర్వాత క్యూబా, కొలంబియా వంటి దేశాలపైనా దృష్టి పెట్టే అవకాశం ఉందన్నారు. అమెరికా వెనెజువెలా అధ్యక్షుడిని బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో ఖండించాయి. ఆ దేశంపై యూఎస్ నిర్వహించిన



దాడులు దురాక్రమణ కిందకే వస్తాయన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని.. వెనెజువెలా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో పేర్కొన్నారు. ఈ విషయంపై ఓఏఎస్ (ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్), ఐక్యరాజ్య సమితిని వెంటనే సమావేశం కావాలని కోరారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 05 డిసెంబర్ 2025




www.viswamvoice.com

# ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రజా నాయకుడు...

## ఎమ్మెల్యే వేగుళ్ళకు జన నీరాజనం - ఘనంగా అభినందన పౌర సన్మానం - వైసిపి గైర్హాజరు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం లో విశేష కృషిచేసిన ప్రజా బాంధవుడు అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అభినందన పౌర సన్మానం ఘనంగా నిర్వహించారు. మండపేట నియోజకవర్గన్ని తూర్పుగోదావరిలో చేర్చి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఎమ్మెల్యే వేగుళ్ళకు టౌన్ హాల్ వద్ద జేఏసీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం జరిపారు. వేగుళ్ళ ఇంటి వద్ద నుండి విశేష ఆధారణతో అభిమానులు, కార్యకర్తలు,జనసంద్రం నడుమ రథంపై ఊరేగింపుగా ప్రజలకు అభివాదం చేసుకుంటూ సభా వేదిక వద్దకు చేరారు. ఆయన అభిమానులు కేరళ వాయిద్యాలు,భారీ ఎత్తున బాణాసంచా, ఏర్పాటు చేశారు. విశిష్ట అతిథులు గా శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు గా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి , టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎస్ సి కమిషన్ చైర్మన్ కే ఎస్ జవహర్, రాష్ట్ర నీటి సరఫరా అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వివివి చౌదరి, పారిశ్రామిక వేత్త వివివి ఎస్ ఎస్ చౌదరి ( మాధవి బాబు) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణం రాజు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సంకల్ప బలంతో ప్రజల ఆకాంక్షతో నెరవేరిందని, ఎమ్మెల్యే వేగుళ్ల వివాదరహితుడని అన్నారు. మరో విశిష్ట అతిథి సినిమా ఆటోగ్రఫీ శాఖ మాత్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాల విభజనను క్రమ పద్ధతిలో చేయకుండా నిర్వీర్యం చేసిందని దానిని సరి చేయుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటు చేసారన్నారు. మండపేట నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో ఉండడమే సమంజమని తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ కి విన్నవించానని అన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ వ్యూహాత్మకమైన విధానాలతో మాత్రమే ఈ విలీనం సాధ్యమైందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ ఆదరణ అభిమానాలకు తాను ఎప్పుడూ వారికి కృతజ్ఞుడుగా ఉంటానని, వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనని బావోద్వేగంతో అన్నారు. నాలుగు పర్యాలు ఎమ్మెల్యేగా దాదాపు 25 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో ఉన్నానని ఇది సాధారణమైన విషయం కాదని ఇదంతా కేవలం ప్రజలు తమపై చూపించిన ఆదరణ అభిమానాల వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజనలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు వాళ్లు సానుకూలంగా చేసుకున్నారని ఇక్కడ పరిస్థితి పూర్తిగా విభిన్నంగా ప్రజల ఆకాంక్షలు నిర్వీర్యం చేస్తూ మండపేటలో అమలాపురం కేంద్రంగా జిల్లాలో కలిపారని అన్నారు. తను ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మండపేటను రాజమండ్రి కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లా లో విలీనం చేయలని వేగుళ్ల లీలా కృష్ణతో పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను కలిసి విన్నవించుకున్నామని అన్నారు. మండపేట నియోజకవర్గంను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. రాజమండ్రి నియోజకవర్గాలతో సమానంగా మండపేటను కూడా అభివృద్ధి



చేసేందుకు తమ వంతు కృషి చేయాలని మంత్రివర్యులు కందుల దుర్గేష్ కు విజ్ఞప్తి చేశారు. విలీనానికి తమ వంతు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సత్కారం నిర్వహించిన జేఏసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### వైసీపీ గైర్హాజర్...

జె ఏ సి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే వేగుళ్ళకు అభినందన పౌర సన్మానం కు వైసీపీ పార్టీ నేతలందరూ గైర్హాజరయ్యారు. నియోజవర్గ వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కో అప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు సహా హాజరవ్వలేదు. మూడు మండలాలు, మున్సిపాలిటీ, పంచాయితీ తీర్మాణాలు ప్రజల అభిష్టం మేరకు విలీనానికి మద్దతుగా ఆధిపత్యం గల వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇచ్చినందున తుర్పు గోదావరి జిల్లా కేంద్రంగా విలీనం అయినప్పటికీ ఈ సత్కార కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని నియోజకవర్గంలో చర్చనియాంశంగా మారింది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలతో మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ళ నారాయణరావు హాజరయ్యారు.

గ్రీజర్ పేలి 8మందికి

# తీవ్ర గాయాలు

**విశ్వంవాయిస్ న్యూస్ :** వేడి నీళ్ల కోసం గ్రీజర్ గంటలు గంటలు వేసి ఉంచుతున్నారా.....తస్మాత్ జాగ్రత్త....ఇంట్లో బాంబుల్లా మారుతున్న గీజర్లు..!..గ్రీజర్ పేలి 8మంది కి తీవ్ర గాయాలు. ఇంట్లో హాట్ వాటర్ కోసం వినియోగించే గీజర్ సిలిండర్ పేలి 8 మంది గాయపడిన ఘటన ఆంధ్రప్రదేశ్ లోని తాడిపత్రిలో వెలుగు చూసింది. ఇంట్లో ఉన్న గీజర్ ఉన్నట్టుంది ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో భారీగా మంటలు చెలరేగి.. అవికాస్త ఇల్లు మొత్తం వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరు చిన్నారుల సహా మరో ఆరుగురు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సమాచారంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో చిక్కుకున్న కుటుంబ సభ్యులను బయటకు తీసుకొచ్చి అంబులెన్స్ సహాయంతో స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. అయితే గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం క్షతగాత్రులంతా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో ఇంట్లోని ఫర్నిచర్ మొత్తం కాలిపోయినట్టు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# హెల్మెట్, సీటు బెల్ట్ ధారణపై ప్రజలకు అవగాహన

- రోడ్డు ప్రమాదాలు దేశ జీడీపీపై 3శాతం ప్రభావం
- జాతీయ రహదారి మాసోత్సవాలు 2026కు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల
- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ కుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ రహదారి మాసోత్సవాలు- 2026ను అనుసరించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో, పోలీసు శాఖ సిబ్బంది, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారు నడిపే వారికి సీట్ బెల్ట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ రహదారి మాసోత్సవాల సందర్భంగా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రోగ్రామ్స్ రూపొందించినట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, భద్రతా నియమాలు పాటించేలా చేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీపై సుమారు 3 శాతం వరకు ప్రభావం పడుతోందని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఇకపై ప్రతి ఏడాది నెల రోజుల పాటు జాతీయ రహదారి మాసోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశం చెయ్యడం జరిగిందనీ తెలిపారు. రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆదిత్య కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ, నాలుగు చక్రాలు వాహనాలు నడిపే వారికి సీట్ బెల్ట్ ధారణ అవసరాన్ని తెలియజేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మోటార్ సైకిల్ నడిపే వారు హెల్మెట్ ధరించకుంటే రూ.1000, కారు నడిపే వారు సీటు బెల్ట్ ధరించకుంటే రూ.1500 అపరాధ రుసుము విధించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రమాదం జరిగే తీరును విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐలు జి.ప్రణీత్ కుమార్, ఉమా మహేశ్వరరావు, కె.చైతన్య సుమ,ఆదిత్య కాలేజీ డైరెక్టర్ ఎస్.పి. గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ సీహెచ్. ఫణి కుమార్, ఎం.చంద్రశేఖర్, కె.వి.శ్రీరామ్, కె.సుధాకర్ పట్నాయక్, ఎఫ్ఎస్ఎస్ సభ్యుడు కె.సుధాకర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు బి.రామకృష్ణ, బి.విమల, ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. కిరణ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, ఆదిత్య కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# గోదావరి మధ్యలో రాణా ప్రతాప్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పాలి

**రాజమండ్రికి ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ ఎందుకు అభివృద్ధికి నోచుకోవటం లేదు? - రాజమండ్రిలో రైల్వే విడి బాగాల తయారి పరిశ్రమకు ఎంతో అవకాశం వుంది - గోదావరి గట్టును హైదరాబాద్ ట్యాంక్ బాండ్ కు మించి అభివృద్ధిని చేయవచ్చు - మేడా శ్రీనివాస్ సూచనలు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి 2027 పుష్కర నిధుల ఖర్చుల పై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టి ప్రత్యేక నిఘా పెడుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్తాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఒక ప్రకటనలో హెచ్చిరించారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధికి ఎంత గొప్ప రాష్ట్రమో పర్యాటక అభివృద్ధికి రాజమండ్రి అంత గొప్ప నగరం అన్నారు.చారిత్రిక రాజమండ్రికి నలుమూల నుండి మెరుగైన ఆదాయ మార్గాలు ఉన్నప్పటికి వాటిని సద్వినియోగం చేయగల సమర్థవంతమైన అధికార యంత్రాంగం , పాలకులు లేకపోవటం ఈ నగరం దురదృష్టంగా బావించి,పేరుకు మాత్రమే నగరపాలక సంస్థగా రూపాన్తరం చెందిందాన్నారు . ఆచరణలో మాత్రం పంచాయితీ సేవలు కూడా రాజమండ్రి నగర ప్రజలు పొందలేక పోతున్నారు . ప్రజల ఆదాయ మార్గాలకు మించి ఈ నగర ప్రజలు పన్నులు చెల్లిస్తున్నారు . అందుకు తగిన సౌకర్యాలు ఏ మాత్రం ప్రజలు పొందలేక పోతున్నారు . నగరంలో లెక్కకు మించిన ప్రాంతా లు గబ్బు కంపు కొడుతున్నాయి. కాలువల్లో పూడికలు తీయరు, పారిశుధ్యం అంతంత మాత్రంగా కూడా జరుపరు . కొన్ని కొన్ని రోడ్లు ఏళ్ల తరపడి గుంతలు తోను , సగం సగం పనులు తో ఉంటున్న కారణంగా ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన చెందారు . రాజమండ్రిలో గల గోదావరి గట్టును హైదరాబాద్ ట్యాంక్ బాండ్ మాదిరి కన్నా ఎంతో గొప్పగా పర్యాటక అభివృద్ధిని సాధించ గల అవకాశాలు గల నగరం రాజమండ్రి అని ప్రభుత్వం గుర్తించాలి . రాజమండ్రి లో గల ,న్యాయస్థాన సముదాయాల ప్రక్క మార్గం నుండి శేషయ్యమెట్ట మీదుగా పురుషోత్త పట్నం వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవు గల గోదావరి గట్టును పర్యాటక అభివృద్ధి దృష్టితో ప్రభుత్వం ఆలోచిస్తే యావత్ భారతదేశంలో ఏ నగరం పోటి పడలేని సుందరి కరణతో అబ్బుర పడే అందం రాజమండ్రి ,నగర



సొంతం అన్నారు . పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తే ఉమ్మడి గోదావరి జిల్లాలు ఉద్యోగ, ఉపాధి మార్గాలు ఎంతగానో అభివృద్ధి సాధిస్తాయని , ప్రభుత్వనికి సైతం బారి స్థాయిలో ఆదాయ మార్గాలు లభిస్తాయని , పుష్కలమైన ప్రకృతి అందాలు ఈ నగరం సొంతమని ఆయన గుర్తు చేసారు . రాజమండ్రి రైల్వే రవాణాకు ఎంతో అనువైన ప్రాంతం అని , అటు విజయవాడ నుండి విశాఖపట్నం వరకు ఈ నగరం అనుసంధానంగా పని చేస్తుండన్నారు . హనుమాన్ జంక్షన్ , నిడదవోలు , సామర్లకోట వంటి రైల్వే జంక్షన్స్ రాజమండ్రి నగరానికి కనక్ట్ అయ్యి వున్నాయని , ఈ నగరంలో రైల్వే విడి బాగాల పరిశ్రమను స్థాపిస్తే రైల్వే శాఖకు రవాణా , తయారి ఖర్చు తగ్గి మెరుగైన ఉపాధి మార్గాలుతో ఈ ప్రాంత ప్రజలు పేదరికం లేని జీవితాలు పొందుతారన్నారు . ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరిగితే ఈ పరిసర ప్రాంతాలు చాలా పెద్ద స్థాయిలో అభివృద్ధి చెందుతాయాన్నారు . ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నిరుద్యోగులు లేని ప్రాంతాలుగా గుర్తింప బడతాయని , తద్వారా నేర వ్యవస్థ కూడా తగ్గు ముఖం పడుతుందన్నారు . ప్రభుత్వం, నేతలు ఈ నగర అభివృద్ధి పై దృష్టి సారిస్తే హైదరాబాద్ కు మించిన మహా నగరం గా రూపాన్తరం చెందుతుందని ఆయన తెలిపారు . ప్రపంచంలోనే రాజమండ్రి గోదావరికి పుణ్యానది , జీవనది అనే గొప్ప ఖ్యాతి ఉండన్నారు . ఈ నగరంలో గోదావరి గట్టుకు ఆనుకుని కోటిలింగాల రేవు వద్ద దక్షణ కాశీ గా పేరు గాంచిన శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి పుణ్య దేవాలయం , గోదావరి మధ్యలో చరిత్రత్మాకమైన పాపికొండలు , అటు ప్రక్క గోవు పాదాల క్షత్రం , శంకర్ ఘాట్ , పుష్కరాల రేవు , మార్కండేయ రేవు , సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్ , పట్టిసీమ వంటి పసిద్ధి గాంచిన పుణ్య ప్రాంతాలు ఈ నగరంలో వుండటం ఇక్కడ ప్రజలతో పాటుగా ఇతర ప్రాంతాల వారు సైతం అదృష్టంగా బావిస్తారు . ఈ ప్రాంతాలు అన్ని పుణ్యనది గోదావరి పరివాహిక ప్రాంతాన్ని ఆనుకుని ఉండటం విశేషంగా బావించాలి . ఈ మహా పుణ్యనది గోదావరి మధ్యలో విదేశీ ఆక్రమణ దారులను మట్టి కరిపించి భారతీయ పౌరుషం , వీరోచితాన్ని రుచి చూపించిన మహా యోధుడు రాణా ప్రతాప్ సింగ్ 101 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పితే పర్యాటకుల దృష్టిని రాజమండ్రి నగరం ఆకర్షిస్తుందని , బావితరాలు ఆ మహా యోధుడును, ఆ యోధుడు త్యాగాన్ని గుర్తు చేసుకుంటు జాతీయ బావాలను , దేశభక్తి ని నిత్యం స్మరించుకుంటారని ఆయన ఉద్విగ్నంగా తెలిపారు. 2027- రాజమండ్రి పుష్కరాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సర్కార్ 3000 వేల కోట్లు నిధులను ఖర్చు చేస్తున్నట్టుగా చెప్పిందన్నారు . 50% నిధులను పూర్తిగా నగర అభివృద్ధికి, జలకాలుష్య నివారణకు , పర్యావరణ రక్షణకు , పర్యాటక అభివృద్ధికి మాత్రమే వినియోగించాలన్నారు . నిధులను దారి మళ్లీస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు . పుష్కర నిధులు ఖర్చుపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పూర్తి స్థాయిలో నిఘా దృష్టి సారిస్తుందన్నారు . పుష్కర నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల పైన , దారి మళ్ళించిన నేతలు, పాలకులు పైన న్యాయపరమైన చర్యలు తప్పవని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూటిగా హెచ్చిరించారు. ఈ సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ డి వి ఆర్ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ సిమ్మా దుర్గారావు,దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్ , ఎమ్.డి హుస్సేన్ , కారుమూరి యుగంధర్ , దుడ్డే త్రినాద్,వల్లి శ్రీనివాసరావు,గుడ్ల సాయి దుర్గా ప్రసాద్,బసా సోనియా,వాడపల్లి జ్యోతిష్ ,కాకర ప్రసాద్ , యర్రా బాలమురలికృష్ణ , చల్లా సాంబశివరావు ,చల్లా అఖిల్,మాసా అప్పాయమ్మ,అడపా శేషగిరి,పి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసుల రికార్డు యాత్ర.. 1300 కి.మీ. సైకిల్ ర్యాలీ చాలా స్పెషల్

'డ్రగ్స్ వద్దు.. భవిష్యత్తు ముద్దు' అనే నినాదంతో ఉత్తరాంధ్రలో పోలీసులు నిర్వహించిన సైకిల్ ర్యాలీ ముగిసింది. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం పోలీసులు ఉత్తరాంధ్రలోన ఐదు జిల్లాల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. నవంబరు 13న అనకాపల్లి జిల్లాలో మొదలైన సైకిల్ యాత్ర సుమారు 1300 కిలోమీటర్లు సాగింది. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువత, విద్యార్థులలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆధ్వర్యంలో పోలీసులు ఈ ర్యాలీ చేపట్టారు. అనకాపల్లి జిల్లాలో హోంమంత్రి ప్రారంభించగా, శ్రీకాకుళం జిల్లాలో ముగింపు వేడుకలు శనివారం జరిగాయి. ఇచ్ఛాపురం పట్టణంలో అట్టహాసంగా అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం సైకిల్ యాత్ర చేసిన పోలీసులను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా పట్టణ పోలీస్ స్టేషన్లో పైలాన్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పంతో



ఉన్నారని, ఆయన లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయాలనే సంకల్పంతోనే పోలీసులు ఈ వినూత్న కార్యక్రమం చేపట్టారని అంటున్నారు. హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గం పాయకరావుపు నుంచి ప్రారంభించిన సైకిల్ ర్యాలీ ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లో ప్రతి ఊరి మీద నుంచి సాగింది. 23 మంది పోలీసులు నిరంతరం సైకిల్ యాత్ర చేశారు. ఇప్పటివరకు తెలుగునాట రాజకీయ లక్ష్యలతోనే ఇలాంటి తరహా యాత్రలు జరిగేవి. కాని తొలిసారిగా ఒక సామాజిక లక్ష్యంతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం ఆసక్తి రేపుతోంది. గంజాయి, డ్రగ్స్ వాడొద్దని చెప్పడమే కాకుండా, పోలీసులు ఈ విషయంలో ఎంత బలంగా పనిచేస్తామో చెప్పడం విశేషంగా చెబుతున్నారు. యుద్ధ నీడలో వెనిజులా.. కరెంటు, ఆహారం కోసం హాహాకారాలు ఇక పోలీసులు ధృడమైన లక్ష్యంతో చేపట్టిన సైకిల్ ర్యాలీకి ప్రభుత్వం కూడా గట్టి మద్దతు ప్రకటించింది. ఇచ్ఛాపురంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహననాయుడుతోపాటు రాష్ట్ర హోంమంత్రి అనిత ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పోలీసులు స్వతహాగా నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రజాప్రతినిధులు కూడా ముందుకు రావడం వల్ల సైకిల్ ర్యాలీ చేసిన పోలీసులకు మంచి ప్రోత్సాహం అందించినట్లైందని అంటున్నారు. పోలీసులు చేసిన వినూత్న కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు స్వాగతించి ప్రభుత్వంపై ఉద్యోగులకు గౌరవం పెరుగుతుందని, కమిట్మెంట్ తో పనిచేస్తారని కూడా చెబుతున్నారు.

## ఎడిటర్ వాయిస్

# పిఠాపురంలో పవన్ సంక్రాంతి.. స్పెషల్ ఏంటంటే...

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ఏడాది సంక్రాంతి వేడుకలను తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరుపుకోనున్నారు. పిఠాపురంలో పవన్ సంక్రాంతి.. స్పెషల్ ఏంటంటే... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ఏడాది సంక్రాంతి వేడుకలను తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరుపుకోనున్నారు. తెలుగు వారి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని ఏపీలో చాలా ప్రత్యేకంగా జరుపుకుంటారు. అందులోనూ గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి మరింత ప్రాధాన్యం ఉంటుంది. ఈ సారి పవన్ కూడా అక్కడకే వెళుతుండటంతో పెద్ద పండుగ మరింత సంబరంగా జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఇక పవన్ హాజరుకానున్న సంక్రాంతి సంబరాలను మరింత జోష్ ఉండేలా ప్రభుత్వం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఈ సారి పిఠాపురంలో సంక్రాంతి అదిరిపోతుందని అంటున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల నాడు ఏపీలో పెద్ద సంబరాలే నిర్వహిస్తారు. భోగి రోజున ఊరూరా భోగి మంటలు వేస్తుంటారు. సంక్రాంతికి పెద్దలకు పితృ తర్పణాలు సమర్పిస్తారు. ఇక కనుమ రోజు సంబరాలు అంబరాన్ని అంటుతాయి. కోస్తా జిల్లాల్లో ముఖ్యంగా గోదావరి తీరంలోని ఐదు జిల్లాల్లో కోడి పందాలు చూసేందుకు జనం తండోపతండోలుగా తరలివస్తారు. ఈ మూడు రోజులలో కోడి పందాల రూపంలో కోట్లాది రూపాయలు పందాలు కాస్తుంటారు. సామూహిక భోజనాలతో అంతా సందడి చేస్తారు. ఇలాంటి చోట ఈ సారి పవన్ స్పెషల్ ప్రోగ్రాం నిర్వహిస్తుండటం ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. అయితే పండుగ మూడు రోజులు కాకుండా కాస్త ముందుగానే పిఠాపురంలో పవన్ సంక్రాంతి వేడుకుల నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు. 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి పండుగ జరగనుండగా, కాస్త ముందుగా అంటే ఈ నెల 10న పిఠాపురంలో సంక్రాంతి వేడుక నిర్వహిస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులు పాటు పిఠాపురంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించాలని పవన్ అధికారులకు సూచించారు. ఇందుకోసం జిల్లా జాయింట్ కలెక్టర్, పోలీసు, ఇతర శాఖల అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం హాజరయ్యే సంక్రాంతి కోసం జిల్లా అధికారులు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.4.80 లక్షల రూపాయలను కేటాయించారు. ఆటపాటలతో ఆర్టిస్టులు సందడి చేయడం ద్వారా ప్రజల్లో ఉత్తేజం తీసుకురావాలని, ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా గ్రామాల్లో



సాంస్కృతిక శోభ పెంచేలా సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తూ వచ్చేవారు. ఈ సారి ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలోగానే పవన్ తన సొంత నియోజకవర్గంలో ముందస్తు సంక్రాంతి వేడుకలకు ఏర్పాట్లు చేయించడం చర్చనీయాంశం అవుతోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




### ఆడుకుంటూ స్విమ్మింగ్‌పూల్‌లో
# పడి బాలుడి మృతి

**హైదరాబాద్(కేపీహెచ్‌బీ), విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి అర్జున్ కుమార్ (3) మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెర్టెక్స్ ప్రైమ్ గేటెడ్ కమ్యూనిటీలో జరిగింది. బాలుడి తల్లిదండ్రులు చింతల్‌లో నివసిస్తుండగా, సెలవుల నిమిత్తం బాలుడిని హైదర్‌నగర్‌లోని అమ్మమ్మ ఇంట్లో వదిలి వెళ్లారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఆడుకుంటున్న అర్జున్ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో కొంతసేపటి తర్వాత బాలుడు నీటిపై తేలుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ



సభ్యులు బాలుడిని నిజాంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారాంతం సమయమైనా పూల్ వద్ద కేర్ టేకర్స్ లేకపోవడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షకుడు అందుబాటులో లేకపోవడం ప్రమాదానికి కారణమైందని బాలుడు తండ్రి వాపోయారు. అర్జున్ ఇక లేడు.. అందనంత దూరం వెళ్లిపోయాడని బాలుడి తండ్రి తన మిత్రుల వద్ద విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

# విజయవాడలో.. ఐఏఎస్ అధికారి భార్య అనుమానాస్పద మృతి

**పటమట(విజయవాడ), విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఐఏఎస్ అధికారి భార్య చికిత్స పొందుతూ అర్ధరాత్రి హఠాత్తుగా మృతి చెందారు. దీనిపై ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు మెడికో లీగల్ కేసు సమాచారం ఇవ్వడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఐఏఎస్ అధికారి జి.కె.కిషోర్ కుమార్ ఏపీ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ మొగల్రాజపురంలో భార్య సత్య దీపిక(42), ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సత్య దీపిక డిసెంబరు 24 నుంచి 27 వరకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని డిశ్చార్జ్ అయ్యారు. గొంతు ఇన్ఫెక్షన్ రావడంతో మళ్లీ గత నెల 31న అదే ఆసుపత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న తన సోదరి సరితకు ఫోన్ చేసి గొంతు ఇన్ఫెక్షన్ వల్ల మాట్లాడలేకపోతున్నాను. డిశ్చార్జ్ అయిన తర్వాత మీ ఇంటికి వస్తానని చెప్పింది. ఈ క్రమంలో.. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి 1.20 గంటలకు హఠాత్తుగా మృతి చెందారు. దీంతో ఆసుపత్రి వైద్యులు పటమట పోలీసులకు మెడికో లీగల్ కేసు కింద సమాచారం అందించారు. రిపోర్ట్‌లో కార్డియాక్ అరెస్ట్ లేదా ఇతర కారణాల వల్ల మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఇరు వర్గాలను విచారించగా మృతిపై వారు ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదు. తమకు కేసు అవసరం లేదని తెలిపారు. ఆసుపత్రి మెడికో లీగల్ కేసు కింద ఇంటిమేషన్ ఇచ్చారని కేసు నమోదు చేయాలని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి సోదరి సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

### భార్య తొమ్మిది నెలల గర్భిణి..
# బిడ్డలను పోషించలేక తండ్రి ఆత్మహత్య

**కామారెడ్డి జిల్లాలో ఘటన**



**బీర్కూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** బిడ్డలను పోషించలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీర్కూర్ మండలం వీరాపూర్‌దుబ్బాకు చెందిన ప్రహ్లాద్ (30) అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన సౌందర్యతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు స్నేహ (8), హర్షిత (6), వసుంధర (4) ఉన్నారు. ప్రహ్లాద్ రోజూవారీ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, వారిని ఏ విధంగా చదివించి, వివాహాలు చేయాలని బాధపడేవారు. ప్రస్తుతం సౌందర్య 9 నెలల గర్భిణి. ఈ నెల 26లోపు కాన్పు అవుతుందని వైద్యులు తెలిపారు. నాలుగో సంతానం కూడా కుమార్తె జన్మించొచ్చనే భయంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో కుటుంబ సభ్యులు చూస్తుండగానే విష ద్రావకం తాగారు. కుటుంబీకులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రాంతీయ దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతదేహానికి శవ పరీక్ష చేసి కుటుంబీకులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. కాగా ప్రహ్లాద్ గతంలోనూ మూడు సార్లు ఆత్మహత్యకు యత్నించగా.. కుటుంబీకులు కాపాడారు.

### అందరూ చూస్తుండగా
# రైలు కింద పడి ఆత్మహత్య



**మృతుడు మాజీ సైనికుడు..**

**విశాఖపట్నం (కూర్మన్నపాలెం), విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ మాజీ సైనికుడు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు చూస్తుండగా రైలు కింద ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ప్రమాదం ధాటికి తమ కళ్ల ముందే ఆ వ్యక్తి మొండెం, తల వేరయిపోవడంతో అందరూ భయంతో వణికిపోయారు. విశాఖ సమీప దువ్వాడ రైల్వేస్టేషన్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం 1.10 గంటల సమయంలో హావ్‌డా–బెంగళూరు ప్రత్యేక రైలు ఒకటో ప్లాట్‌ఫాం మీదకు వస్తోంది. ఇంతలో ఫ్లాట్‌ఫాంపైన కూర్చున్న ఓ వ్యక్తి గబగబా వెళ్లి పట్టాలపై తల పెట్టి పడుకోవడంతో రైలు అతడి మీద నుంచి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుణ్ని విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం నెల్లిముక్కుకు చెందిన నీలాపు వెంకటరమణారెడ్డి (65) అలియాస్ సైనికుడిగా గుర్తించారు. కొంతకాలం సైన్యంలో పనిచేసిన ఆయన.. పదవీ విరమణ తర్వాత ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం చేశారు. గతంలో తెదేపా సైనికుల విభాగం అధ్యక్షుడిగానూ సేవలందించారు. ప్రస్తుతం కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం వరకు కిరాణా దుకాణం నిర్వహించిన వెంకటరమణారెడ్డి.. తర్వాత రైల్వేస్టేషన్‌కు వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. గత కొన్నాళ్లుగా ఆయన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా.. ఆ ఒత్తిడితోనే ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

### 17వ అంతస్తు నుంచి పడి
# ఐవోసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మృతి

**నోయిడా, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లలో ఒకరైన అజయ్ గార్గ్ 17వ అంతస్తు నుంచి పడి మృతి చెందారు. ఈ ఘటన నోయిడాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ ఏటీఎస్ వన్ హామ్లెట్ హౌసింగ్ సొసైటీలో భార్యతో కలిసి నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం అజయ్‌కు ఫోన్ రాగా.. నెట్‌వర్క్ సమస్య తలెత్తింది. దీంతో సిగ్నల్ కోసం ఆయన బాల్కనీలోకి వెళ్లారు. కొద్దిసేపటికి అజయ్ 17వ అంతస్తు నుంచి కిందపడ్డారు. గమనించిన స్థానికులు ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అజయ్ పైఅంతస్తు నుంచి పడినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు.. జారి పడ్డారా? ఆత్మహత్య చేసుకున్నారా? మరేమైనా జరిగిందా? అనేది తేల్చాల్సి ఉందన్నారు. విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

# పిల్లల్లో ఈ పోషకాల లోపం ఎక్కువగా ఉంటాయ్..




ఈ రోజుల్లో పిల్లలు పోషకాహార లోపంతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు ఎలాంటి పోషకాల లోపంతో ఇబ్బంది పడుతున్నారు. తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి. చిన్నారులకు పోషకాహారం ఇవ్వడం ఎంతో ముఖ్యం. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు సమతుల్య, పోషకాహారం ఇవ్వడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే.. పిల్లలు జంక్‌ఫుడ్, చిప్స్ తిన్నంత ఇష్టంగా.. హెల్తీ ఫుడ్‌ను ఇష్టపడరు. ఆ చిరుతిండ్లతోనే పిల్లలు కడుపు నింపుకుంటారు. దీని వల్ల వారు పోషకాహార లోపానికి గురవుతూ ఉంటారు. దీని కారణంగా రోగనిరోధక వ్యవస్థ బలహీనపడి.. ఇన్ఫెక్షన్లకు, అనారోగ్యాలకు గురవుతూ ఉంటారు. చిన్నారుల్లో ఎక్కువగా కనిపించే పోషకాల లోపం ఏమిటి? ఈ పోషకాల లోపం భర్తీ చేయడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలంటే..

**ఐరన్ లోపం..**

ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి, తగినంత ఐరన్ అవసరం. ఐరన్ లోపం ఉంటే హెమోగ్లోబిన్ తగ్గడం వల్ల రక్తహీనత వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఐరన్ లోపం ఉంటే.. పిల్లల్లో రక్తహీనత సమస్య వస్తుంది. పిల్లల్లో ఐరన్ లోపం కారణంగా అలసట, నీరసం, బలహీనత వంటి సమస్యలు ఎదురవుతాయి.

**పుట్టుకతో గుండెలో ఉండే రంధ్రం తో సమస్యలు**

**విటమిన్ డి లోపం..**

విటమిన్ డి లోపం వల్ల ఎముకల బలహీనపడటం, రోగనిరోధక శక్తి బలహీనపడటం ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. విటమిన్ డి లోపం ప్రధానంగా సూర్యరశ్మికి గురికాకపోవడం వల్ల వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ సమయం ఇంటి లోప సమయం గడిపే పిల్లలకు, సూర్యకాంతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించే పిల్లలు విటమిన్ డి లోపానికి గురవుతూ ఉంటారు. పోషకాల్లో క్యాల్షియం, విటమిన్ డి.. ఎంతో ముఖ్యమైనవి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంటాయి. ఇవి సరిపడ మోతాదులో శరీరానికి అందకపోతే కండరాల నొప్పి, ఎముకలు బలహీనంగా మారడం.. వంటివి జరుగుతుంటాయి. అలాగే చిన్న పనికే నీరసపడిపోతుంటారు.?

**పేరెంట్స్ ఈ జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలి..!**



**కాల్షియం లోపం..**

కాల్షియం లోపం వల్ల ఎముకలు, దంతాలు బలహీనపడతాయి, అలాగే పెద్దయిన తర్వాత ఎముకలలో పగుళ్లు, ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఎముకల పెరుగుదల, శరీర అభివృద్ధి గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు, కౌమారదశలో ఈ పోషకం చాలా ముఖ్యం. చిన్నారులలో పోషకాహార లోపం ఉంటే.. తల్లదండ్రులు ఈ జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలి..

**సమతుల్య ఆహారం ఇవ్వండి..**

పిల్లల్లో పోషకాహార లోపాన్ని దూరం చేయడానికి.. వారి డైట్ పోషకాలు అధికంగా ఉండే రకరకాల ఆహార పదార్థాలను చేర్చండి. ఇందులో తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పండ్లు, కూరగాయలు వారి డైట్‌లో చేర్చండి. రంగురంగుల రైన్‌బో.. డైట్ ఇవ్వండి. అదే విధంగా రంగుల పండ్లు, కూరగాయలు వారి ఆహారంలో చేర్చండి. ఆకుకూరలు, ఆరెంజ్, స్క్వాష్, ఆపిల్, బ్లూబెర్రీస్ వంటి ఇవ్వండి.

ఆరోగ్యకరమైన ఆహారంపై పిల్లలను ఎడ్యుకేట్ చేయండి..

హెల్తీ డైట్ గురించి చిన్న వయస్సు నుంచే.. పిల్లలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించండి. కొన్ని ఆహారాలు వారి పెరుగుదల, అభివృద్ధికి ఎలా సహాయపడతాయో వారికి అర్థమయ్యేలా చెప్పండి. మీ పిల్లలతో కలిసి వంట చేయడం, కొత్త ఆహారలను వండటం వంటివి చేయండి.?

ప్రాసెస్ చేసిన, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచండి..

ప్రాసెస్ చేసిన, జంక్ ఫుడ్‌లో కేలరీలు, ఉప్పు ఎక్కువగా ఉంటాయి. కానీ పోషకాలు తక్కువగా ఉంటాయి. ఈ ఆహార పదార్థాలు వారి ఆరోగ్యానికి హాని చేస్తాయి, అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయి. ఈ ఆహార పదార్థాలను వారికి పెట్టడం వీలైనంత తక్కువగా పెట్టండి.

**హైడ్రేట్‌గా ఉంచండి..**

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో నీరు కీలక పాత్ర పోషిస్తుంది. పుష్కలంగా నీరు త్రాగడానికి, షుగర్ డ్రింక్స్‌ను పరిమితం చేయడానికి పిల్లలను ప్రోత్సహించండి.

ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉంచండి..

పిల్లలు ఫిజికల్‌గా యాక్మివ్‌గా ఉండే.. ఎముకలు బలంగా ఉండటానికి, అభివృద్ధి, బరువు కంట్రోల్ ఉంచడానికి, వారి కండరాల అభివృద్ధికి సహాయపడుతుంది. పిల్లలు ప్రతిరోజూ యాక్టివ్‌గా ఉండేలా.. ఆటలు ఆడించడం, వాకింగ్‌కు తీసుకువెళ్లండి లాంటివి చేయండి.

**తగినంత విటమిన్ డి అందేలా చూడండి..**

బలమైన ఎముకలకు విటమిన్ డి అవసరం. పిల్లలకు సరైన పెరుగుదల, అభివృద్ధికి ఇది కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ డి ఆహార పదార్థాల్లో కంటే సూర్యరశ్మి ద్వారానే శరీరానికి ఎక్కువగా లభిస్తుందన్న విషయం చాలామందికి తెలిసే ఉంటుంది. ఎదిగే పిల్లలకు ఇది ఎంతో అవసరం కూడా. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్త వహించాలంటున్నారు నిపుణులు.

**కాల్షియం అందేలా మానిటర్ చేయండి..**

సరైన ఎముక పెరుగుదల, అభివృద్ధికి పిల్లలకు తగినంత కాల్షియం అవసరం. పాలు, చీజ్, పెరుగు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించండి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
సోమవారం, 05 జనవరి 2026
www.viswamvoice.com





# ప్రజలపై భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

## విద్యుత్ ఛార్జీల్లో గణనీయ తగ్గింపు : మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలపై అదనపు భారం పడకుండా విద్యుత్ ఛార్జీలను తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టి, వినియోగదారులకు ఉపశమనం కలిగించే నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో 2019–2024 మధ్య కాలంలో విద్యుత్ రంగంలో సుమారు రూ.4,498 కోట్ల నష్టాలు వచ్చాయని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూనే, గృహ వినియోగదారులు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు భారం తగ్గించేందుకు



ఛార్జీల్లో తగ్గింపు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే యూనిట్‌కు సుమారు రూ.3.50 వరకు భారం తగ్గించామని, ప్రస్తుతం యూనిట్‌కు సుమారు రూ.1.50 మాత్రమే అదనపు భారం ఉన్నట్లు తెలిపారు. అలాగే మొత్తం విద్యుత్ బిల్లులో గత ఏడాది రూ.5.19 వరకు ఉన్న భారం, ప్రస్తుతం రూ.4.70కి తగ్గిందని వివరించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ధరలను నియంత్రణలో ఉంచామని, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తూ నష్టాలను తగ్గించే చర్యలు చేపట్టామని అన్నారు. విద్యుత్ రంగంలో అవినీతి, అక్రమాలు, గందరగోళానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోలార్, పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తూ దీర్ఘకాలంలో విద్యుత్ ఖర్చులు మరింత తగ్గేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా విద్యుత్ ఛార్జీల నియంత్రణ కొనసాగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలపై అదనపు భారం పడనివ్వబోమని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

## సోషల్ మీడియాలో

# వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న అంశంపై ప్రజలంతా సంయమనం పాటించాలని, సోషల్ మీడియాలో వివాదాస్పద, అభ్యంతరకర పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని రాహుల్ మీనా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆ అంశానికి సంబంధించి స్టేటస్‌కో కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ అధికారులు, జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కొందరు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకర వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల సామాజిక సామరస్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అనధికారికంగా, దూషణాత్మకంగా వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా సంయమనం పాటిస్తూ, శాంతియుతంగా ఉండాలని, సమస్యకు త్వరలోనే అధికారుల సమన్వయంతో పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అల్లరి మూకలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని బైండోవర్ చేయనున్నట్లు వెల్లడించారు. జూదం, కోడి పందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించబోమని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నవారితో పాటు భవిష్యత్‌లో ప్రయత్నించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలని పోలీసులు కోరుకుంటున్నారని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకి సన్మానం

## కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ వన్నెచింతలపూడి గ్రామంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు జరిగిన సన్మాన కార్యక్రమంలో అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, అయితాబత్తుల ఆనందరావు, కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎంపీ



మాట్లాడుతూ మన ప్రాంతంలో రఘురామ కృష్ణరాజు ను సన్మానించుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న సమయంలో అప్పటి ఎంపీ గా రఘురామ చేసిన కృషిని గుర్తించారు. ఢిల్లీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి జగన్ అరాచకాలను ఎండగట్టారన్నారు. రాష్ట్రం కోసం, ఆంధ్రా ప్రజల కోసం అప్పటి ఎన్డీయే పెద్దల సహకారం కోసం పరితపించేవారని గుర్తు చేశారు. రఘురామ చేసిన కృషిని గుర్తించి డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చినట్టుగా ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

## డిప్యూటీ స్పీకర్ ఆర్‌ఆర్‌ఆర్‌కి

# ఘన సత్కారం చేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం వన్నె చింతలపూడి గ్రామంలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో క్షత్రియ సేవా సంఘం వారు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకి ఘన సత్కారం చేయటం జరిగింది. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ వన్నె చింతలపూడి గ్రామం చాలా సుందరంగాను, క్లీన్ గాను ఉందని, మిగతా గ్రామాలు కూడా ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుని కోరారు.

## మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను

# సద్వినియోగం చేసుకోండి

## జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకుని సమస్యలను సమగ్రంగా పరిష్కరించు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి ఆదివారం ఒక ప్రకటనలో అర్జీదారులకు పిలుపు నిచ్చారు జనవరి 5 వతేదీ సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10:00 నుండి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు జిల్లాస్థాయిలో సమస్యలు ఉన్నవారు ఈ యొక్క జిల్లాస్థాయి ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగిం చుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడా నికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ డానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ చ్చన్నారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. రెవెన్యూ క్లినిక్ పేరిట నాలుగు కౌంటర్లు సమస్యలు పరిష్కారం కొరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్య క్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని కావున స్వయంగా వారి దృష్టికి సమస్యలను తీసుకుని వెళ్లే అవకాశం ఉందన్నారు జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దు

## ట్రాఫిక్ ఆర్ఎస్ఐ ఏసుబాబు విన్నపం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సెల్ ఫోన్ డ్రైవింగ్ భావి జీవితాన్ని అంతం చేస్తుంది... ఇంటి వద్ద నీమీద మీ కుటుంబం ఆధారపడి ఉంది అంటూ సందేశం ఇస్తూ చేసిన వీడియో వాట్సాప్, ఇంస్టాగ్రామ్, ఫేస్బుక్ వంటి సోషల్ మీడియాలో లక్షల్లో లైకులు వస్తూ సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా అమలాపురం పట్టణ ట్రాఫిక్ ఆర్.ఎస్ .ఐ(ట్రాఫిక్ షార్జెంట్) యేసుబాబు ప్రజలను అప్రమత్తం చేస్తూ చేసిన వీడియో సెల్ ఫోన్ డ్రైవర్లకు కనువిప్పు చేస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకొని వీడియో చూసి సదరు విషయమై ట్రాఫిక్ ఆర్ ఎస్సై యేసు బాబుకు దుస్సాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపిన జనసేన వీరమహిళ డాక్టర్ కొప్పుల నాగమానస. ఈ సందర్భంగా వీర మహిళ నాగమానస మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు మంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందని, ఆఫీసర్ల మన్నలు పొందుతూ మంచి ప్రమోషన్లు తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మానస ఆకాంక్షించారు.

# మహనీయుని విగ్రహాలు రాత్రి పూట ప్రతిష్టించాల్సిన అవసరం ఏముంది : చిర్ల జగ్గిరెడ్డి

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృష్ణదేవరాయల వారి కాపు కళ్యాణమండపం వద్ద పెట్టాలి అనుకున్న అక్కడినుండి ఆక్సిడెంట్స్ జరిగే స్థలానికి ఎందుకు మార్చారు అక్కడ ఆక్సిడెంట్ జరిగి ప్రాణాలు పోతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు నేను విగ్రహం పెట్టే ఆ స్థలానికి మాత్రమే వ్యతిరేకం కానీ ఆ మహనీయుడు శ్రీ కృష్ణదేవరాయల వారి విగ్రహానికి కాదు అసత్య ప్రచారాన్ని నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా నేను సిద్ధం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన విగ్రహ ఏర్పాటు సంఘటనపై స్పందించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు వారి చిత్రపటాన్ని అవమానించామని, మరియు కాళ్ళ కింద వేసి తొక్కామని కూటమి ప్రభుత్వం వారు అసత్య ప్రచారం చేస్తున్నారు. ఆ సత్య ప్రచారంలో ఎటువంటి నిజం లేదని మహనీయుడి చిత్రపటాన్ని అవమానించలేదని




ఒకవేళ నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా నేను సిద్ధమని చిర్ల అన్నారు. అర్ధరాత్రి అంత మహనీయుని విగ్రహం ఎంకేఆర్ జంక్షన్ నందు ప్రతిష్టించాల్సిన అవసరం ఏముందని అందరితో చర్చించి అనుకూలమైన స్థలంలో రోడ్డు ప్రమాదాలు జరగని స్థలంలో విగ్రహాన్ని ప్రతిష్టిస్తే దానికి మా తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. అలాగే నేను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు వివిధ వర్గాల నుండి సర్ ఆర్థర్ కాటన్, అల్లూరి సీతారామరాజు, జ్యోతిరావు పూలే, అంబేద్కర్, హనుమాన్ విగ్రహాలు పెట్టమని నాకు అభ్యర్థన వచ్చిన అక్కడ తరచూ ఆక్సిడెంట్లు జరిగే ప్రాంతం కాబట్టి అప్పుడు తిరస్కరించాము ఇప్పుడు కూడా అదే మాటపై ఉన్నాం. అది పూర్తిగా యాక్సిడెంట్ జరిగే స్థలమని గతంలో అక్కడ యాక్సిడెంట్ జరిగి ఒకరు ప్రాణాలు కోల్పోయారని మరియు తరచుగా అక్కడ యాక్సిడెంట్ జరుగుతూ ఉన్నాయని అలాగే అదే రోడ్లో నాలుగు కళ్యాణ మండపాలు మరియు స్కూల్లు మరియు హాస్పిటల్ లు ఉండడంవల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ఆ ఉద్దేశ్య ప్రకారంగానే పంచాయతీ తీర్మానం ఉన్నప్పటికీ విగ్రహం పెట్టకూడదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఉన్నా సరే అక్రమంగా అర్ధరాత్రి పూట దిమ్మకట్టి శ్రీకృష్ణదేవరాయలు వారి చిత్రపటాన్ని అక్కడ ప్రతిష్టించడాన్ని ఆయన ఖండించారు. ఇది పూర్తిగా ప్రతిపక్షంలో ఉండి మేము చేస్తున్న ప్రతి కార్యక్రమానికి మరియు కూటమి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రశ్నిస్తున్న తీరుకి మాపై బురద జల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారని అన్నారు. ఆ మహనీయుని విగ్రహంపై నాకు వ్యతిరేకతలేదు అది ప్రజలకు ఇబ్బంది కలిగించాలనిచోట ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేని చోట ఏర్పాటు చేస్తే నా వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ అందిస్తానని అందించటం అదృష్టం అని ఆయన అన్నారు.

## జిల్లా అధ్యక్షులు ఎలాగా కొత్తూరు శ్రీనివాసుకి

# అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన కొత్తూరు శ్రీనివాసుని అమలాపురంలో వారి స్వగృహంలో అంబాజీపేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరన్నారాయణ, అంబాజీపేట మండల అధ్యక్షులు దొమ్మేటి వినోద్ కుమార్, ములపర్తి మోహన రావు, బొంతు శివ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు కూటమి నాయకుల ఘన స్వాగతం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజుకు అమలాపురం కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో సత్కరించారు.డిప్యూటీ స్పీకర్‌ను సత్కరించిన వారిలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, నల్లా స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా సత్యప్రసాద్, సీనియర్ న్యాయవాది మాకిరెడ్డి ఆదినారాయణ రావు, జనసేన నాయకులు యేడిద శ్రీను, కల్వకొలను తాతాజీ, ఆర్డీఎస్ ప్రసాద్, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, బీజేపీ నాయకులు నల్లా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై డిప్యూటీ స్పీకర్ పర్యటనను విజయవంతం చేశారు.

# భోగాపురం విమానాశ్రయం దేశంలోనే రెండోది.. ఈ రికార్డు ఎందుకంటే..

విశాఖపట్నం సమీపంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం అరుదైన రికార్డు నమోదు చేసింది. రెండు రోజుల్లో ట్రైల్ రన్ కు సిద్ధమవుతున్న ఈ విమానాశ్రయం గ్రీన్ ఫీల్డ్ విభాగంలో దేశంలోనే రెండో ఎయిర్ పోర్టుగా ఖ్యాతి గడించింది. వాయువేగంతో పూర్తయిన గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంగా కూడా భోగాపురం పేరు తెచ్చుకుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరో ఆరు నెలల్లో వినియోగదారులకు అందుబాటులోకి రానున్న ఈ విమానాశ్రయం విశాఖ నగరానికి తద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గేమ్ ఛేంజర్ గా పనికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఈ నెల 4న టెస్ట్ ఫ్లైట్ కు రంగం సిద్ధం కావడంతో భోగాపురం నిర్మాణం పూర్తయినట్లే భావిస్తున్నారు. చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉండటంతో భోగాపురం ఎయిర్ పోర్టు వీలైనంత త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. దేశంలో రెండో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం భోగాపురం. దీనికి ముందు ముంబై మహానగరంలో తొలి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మించారు. అయితే ఈ రెండు విమానాశ్రయలను పోల్చి చూస్తే.. భోగాపురం విమానాశ్రయం కొత్త చరిత్రను నమోదు చేసినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకున్న ముంబై రెండో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు దాదాపు 25



ఏళ్ల పాటు సాగాయని చెబుతున్నారు. దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబైలో విమానాల ట్రాఫిక్ పెరిగిపోవడంతో రెండో విమానాశ్రయం ఉండాలని 90వ దశకంలోనే ప్రభుత్వం భావించింది. కానీ, అనేక అవాంతరాలతో నిర్మాణానికి సుదీర్ఘ కాలం పట్టిందని అంటున్నారు. ఇదే సమయంలో మరో మెట్రో నగరం బెంగళూరులో రెండో విమానాశ్రయం నిర్మాణం కోసం అక్కడి ప్రభుత్వాలు పదేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. కానీ, ఇంతవరకు కార్యరూపం తేలేకపోయాయని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బెంగళూరుకు రెండో విమానాశ్రయం ఎప్పుడు ప్రారంభం అవుతుందో.. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉందని అంటున్నారు. కానీ విశాఖపట్నంలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం రికార్డు సమయంలో పూర్తయింది. ఇది విశాఖ వాసులకు ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చిన రెండో విమానాశ్రయం కావడం గమనార్హం. ముంబై, బెంగళూరుకి దశాబ్దాలు పట్టిన పని విశాఖలో రెండేళ్లలోపే పూర్తయిందని, ఈ సక్సెస్ కు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కారణమని కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. నిజానికి భోగాపురం విమానాశ్రయం ఐదేళ్ల క్రితమే పూర్తి కావాల్సివుందని అంటున్నారు. 2019లోనే ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన జరిగితే.. రకరకాల కారణాల వల్ల పనులు ముందుకు సాగలేదు. 2023లో అప్పటి సీఎం జగన్ మరోసారి విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆయన అధికారం నుంచి దిగిపోయారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రభుత్వ మార్గనిర్దేశంలో కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసింది. విజయనగరం జిల్లాలో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ చేపడుతోంది. ఈ సంస్థ యాజమాన్యం స్థానికులే కావడం, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతీయుడే కావడంతో రికార్డు సమయంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని పూర్తి చేశారని అంటున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న ఆలోచన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మార్గ నిర్దేశంలో పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డి.శ్రీహరి రాజు, ప్రతిపాడు సిఐ. బి.సూర్యఅప్పారావు సూచనలతో అన్నవరం పోలీసులు నూతన సంవత్సరంలో ప్రమాదాల నివారణకు వినూత్న ఆలోచన చేసారు. జాతీయ రహదారి 216 లో అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నుజ్జు అయిన కార్లకు రేడియం స్టిక్కర్లను అతికించి ఆపై ఆ కార్లను శనివారం రాత్రి రోడ్డు పక్కన ఉంచారు. రోడ్డుపై వెళ్ళే వాహన చోదకులు ఈ వాహనాలను చూసి ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తం చేసే విధంగా ఉంచారు. తద్వారా వాహన చోదకులు అతివేగంగా వెళ్లకుండా, జాగ్రత్తగా వెళ్తూ వారి ప్రయాణం సురక్షతంగా జరగాలని పోలీసులు ఆకాంక్షంచారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు చొరవ చూపిన అన్నవరం పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్.ఐ. జి.శ్రీహరిబాబు, తొండంగి ఎస్.ఐ. జగన్మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితుడు రామకృష్ణను పరామర్శించిన అనూష యాదవ్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో డిసెంబర్ 31వ తేదీ రాత్రి దాడికి గురైన ముత్తిన రామకృష్ణను భారత చైతన్య యువజన పార్టీ 2024 కాకినాడ ఎంపీ అభ్యర్థిని డాక్టర్ అనూష యాదవ్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. బాధిత కుటుంబానికి చట్టబద్ధం గా రక్షణ కల్పించాలని, అలాగే దోషులను కఠినంగా శిక్షంచాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక పౌరునిపై విచక్షణా రహితంగా దాడి చేసిన దోషులను రక్షంచి, కేసును నీరుగార్చే ప్రయత్నాల్లో జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు నిమగ్నం అవ్వడం వలన బాధిత కుటుంబం భయాందోళనకు గురవుతోందని, న్యాయం దక్కదేమోనని ఆందోళనలో ఉన్నారని, వారందరికీ న్యాయం జరిగే వరకు తను అన్ని విధాల అండగా ఉంటానని అనూష యాదవ్ అన్నారు. ఈ విషయం మొత్తాన్ని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ కు చరవాణీలో బాధితుడే స్వయంగా వివరించారనీ, అందుకు రామచంద్ర యాదవ్ ప్రతిస్పందిస్తూ బాధిత కుటుంబానికి తోడుగా ఉంటానని, అవసరమైన సందర్భంలో కత్తిపూడి కొచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తానని రామచంద్ర యాదవ్ తనకు చెప్పారనీ 2024 కాకినాడ ఎంపీ అభ్యర్థిని డాక్టర్ అనూష యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి, సీతంపేట గ్రామాల నుంచి పలువురు పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్.ఎస్.ఎస్. సామాజిక, సాంస్కృతిక, జాతీయవాద సంస్థ

## జిల్లా భా.జ.పా పూర్వ అధ్యక్షులు చిలుకూరి



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) ఒక సామాజిక, సాంస్కృతిక, భారత జాతీయవాద సంస్థని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సంస్థను డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ నాగ్‌పూర్‌లో 27 సెప్టెంబర్ 1925 న విజయదశమి రోజున స్థాపించారని, ఈ సంస్థకు నాగపూర్, మహారాష్ట్రలో ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలో విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ప్రాంతీయ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలు రెండవ తారీఖు నుంచి నాలుగవ తారీఖు వరకు మూడు రోజులూ విజయవంతంగా కొనసాగాయి. ఈ సమావేశాలకు ఆఖరి రోజు ఆదివారం రామ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అబశ్రీశ్రీ ఈ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంస్థ లక్ష్యం వ్యక్తి నిర్మాణం, దేశ నిర్మాణం ద్వారా మాతృభూమి సంక్షమమని పేర్కొన్నారు. ఈ సంస్థ 2025 అక్టోబరులో తన శత వార్షికోత్సవాలను (100 సంవత్సరాలు) పూర్తి చేసుకుంది. దీనిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్మారక నాణేలు, స్టాంపులను విడుదల చేసింది. ఈ సందర్భంగా సంఘ్ దేశ నిర్మాణంలో, సామాజిక సేవలో కీలక పాత్ర పోషించిందని, కార్యక లాపాల నిర్వహణలో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వేతర సంస్థగా ఉందని అభివర్ణించి, దేశం గర్వించేలా ఉందని ప్రశంసించి, స్వయం సేవకులు దేశం కోసం చేసిన సేవను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుర్తు చేసుకున్నారని రామ్ కుమార్ పేర్కొన్నారు. సంఘ్ తన శత వార్షిక సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా దేశ వ్యాప్తంగా సామాజిక సేవ, సంస్కృతి పరిరక్షణ, జాతీయ స్ఫూర్తిని నింపే వివిధ కార్యక్రమాలను నిర్వహించిందని చిలుకూరి చెప్పారు. అన్నవరం మూడు రోజుల ప్రాంతీయ సమావేశాల సందర్భంగా హాజరైన ప్రముఖ నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల వేడుకల జ్ఞాపికలను రామ్ కుమార్ బహూకరించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేసి, ఆత్మీయతను, ఐక్యతను కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షలు చిలుకూరి రామ్ కుమార్ చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# అమ్మోరి డిబ్బీలో డబ్బులు ఎత్తుకెళ్లారు...?!

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు తమ మానం, ప్రాణ, ఆస్తులను కాపాడమని ఏ దేవుళ్ళనైతే మొక్కు కుంటారో... ఆ మొక్కులకు ముడుపులను ఏ ధర్మ హుండీలో వేస్తారో ఆ దేవీ దేవతలకు, ఆ ధర్మ హుండీలకు రక్షణ కరువైంది. సాక్షత్తూ ఆ దేవీ, దేవతల డిబ్బీల్లోని డబ్బులను దొంగలు ఎత్తుకుని వెళుతుంటే... ఇది ఓ ఆనవాయితీగా మారిపోతూంటే చివరకు మానవ నిర్మిత పోలీసు స్టేషన్లనే న్యాయం కోరుతూ ఆశ్రయించాల్సి వస్తోంది. సరిగ్గా ఆ కోవలోనే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలోని శంఖవరం రోడ్డులోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయ హుండీని శనివారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి, కానుకల సొమ్ములను దొంగిలించి తీసుకెళ్లిపోయారు. ఈ చోరీ సొత్తు సుమారు రూ 10,000 లు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల అంచనా. చోరీపై అన్నవరం పోలీసులకు పిర్యాదు చేశారు.



# తెలుగు స్టేట్స్ వాటర్ వార్... కేంద్రం సెటిల్ చేస్తుందా..?

అయితే కేంద్రం పెద్దన్నగా కమిటీలు ఏర్పాటు చేసినా రెండు రాష్ట్రాల సీఎంలను కీలక అధికారులను కూర్చోబెట్టి చర్చించినా కూడా ఈ జల జగడాలు ఒక కొలిక్కి అయితే రావడం లేదు అని అంటున్నారు.

ఉమ్మడి ఏపీ రెండుగా మారింది. అది జరిగి మరో ఆరు నెలలలో పన్నెండేళ్ళు పూర్తి అవుతుంది. అయినా సరే నీటి వివాదాలు మాత్రం ఇంకా కొత్త కొత్తగా రాజుకుంటూనే ఉన్నాయి. ఆ వేడి సెంటిమెంట్ గా మారి సెటిల్ మెంట్ కి ఏ మాత్రం అవకాశం లేకుండా చేస్తోంది. దాంతో కీలకమైన నదీ జలాల పంపిణీ విషయంలో అటు ఆంధ్రా ఇటు తెలంగాణా రాష్ట్రాలు తమ హక్కులు అంటూ పోరాడుతున్నాయి. పేచీలు పడుతున్నాయి. పంచాయతీలు కూడా పెడుతున్నాయి. ముఖ్యంగా చూస్తే తెలుగు నాట గోదావరి కృష్ణా నదీ జలాల విషయంలోనే ఈ పోరు ఎక్కువగా సాగుతోంది. ఈ నదీ జలాలలో ఎవరి వాటా ఏమిటి ఎంత అన్నదే ఎటూ తేలని విషయంగా మారుతోంది.

**కొత్త ప్రాజెక్టుల విషయం :**

నిజానికి చూస్తే రాష్ట్రం రెండుగా మారిన తర్వాత కొత్త నీటి ప్రాజెక్టుల మీద రెండు రాష్ట్రాలూ దృష్టిని పెట్టాయి. పెరిగిన అవసరాలు కనిపిస్తున్న అవకాశాలు ప్రజలకు ఇచ్చిన హామీలు వెరసి కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణానికి కారణం అవుతున్నాయి. అయితే కొత్త ప్రాజెక్టులు అంటే నికర జలాలు ఎంత మిగులు జలాలు ఎన్ని సముద్రంలో కలిసేవి ఎన్ని అన్నది తేలాల్సి ఉంది. ఉమ్మడి ఏపీగా ఉన్నపుడు కృష్ణా గోదావరి జలాల విషయంలో వాటాలు నిష్పత్తులు ఇపుడు పక్కన పెట్టి కొత్తగా తమకు అధిక వాటా కావాలని తెలంగాణా కోరుతోంది. అదే సమయంలో గతంలో ఉన్న మాదిరిగానే నిష్పత్తి ప్రకారం పంపిణీ చేయాలని ఏపీ అంటోంది. ఇక సముద్రంలో కలిసే వృధా నీరు దిగువ రాష్ట్రంగా తామే వాడుకుంటామని అది ఎటూ వేస్ట్ అయ్యేదే కదా అన్నది ఏపీ వాదన. అలా సాగరంలో కలిసే నీటి నుంచి కొంత వరకూ తీసుకుని బనకచర్ల వంటి ప్రాజెక్టులు కొత్తగా కట్టుకుంటామని ఏపీ అంటోంది.

**ఈ లెక్క తేలాల్సిందే :** అయితే అలా కుదిరేదే లేదని తెలంగాణా అంటోంది. తెలంగాణాలో కొత్త ప్రాజెక్టులు ఏపీ కట్టలేదు కాబట్టే నీరు వృధాగా వెళ్ళి సముద్రంలో కలుస్తోంది తప్ప తమకు కేటాయించిన ప్రకారం ప్రాజెక్టులు కడితే అపుడు ఇంకా ఎంత మిగులు జలాలు ఉన్నాయి ఎన్ని వృధా జలాలు ఉన్నాయని లెక్క తీసి మరీ చూసుకోవాలని తెలంగాణా అంటోంది. ఇక సముద్రంలో కలిసే నీటిలో కూడా తెలంగాణా వాటా ఉందని ఆ రాష్ట్రం వాదిస్తోంది. ఇక ఇప్పటికే కేటాయింపులు జరిగిన చోట్లలో కూడా తమకు తెలియకుండా అక్రమంగా నీటిని తరలించుకుని పోతున్నారు అన్నది కూడా రాష్ట్రాల మధ్య మరో పేచీ వ్యవహారంగా ఉంది. దీని మీద కూడా కేంద్రాన్ని పెద్దన్నగా ఉండి తేల్చాలని రెండు రాష్ట్రాలూ కోరుతూ



వస్తున్నాయి.

**దశాబ్దాల నాటి ముచ్చట :** ఇదిలా ఉంటే కృష్ణా గోదావరి జలాల విషయంలో ఉమ్మడి ఏపీగా ఉన్నప్పటి నుంచి వివాదాలు ఉన్నాయి. కర్ణాటక మహారాష్ట్ర ఏపీలో మధ్య నీటి పంచాయతీలు ఎన్నో సార్లు జరిగాయి. విభజన తరువాత అది ఏకంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్తగా నీటి చిచ్చు పెడుతోంది. ఇక తెలంగాణా డిమాండ్ ఏమిటి అంటే గోదావరి క్రిష్ణా ఉమ్మడి ఏపీ అలా మూడు రాష్ట్రాల మధ్య నదీ జలాల ఒప్పందాలు ఉన్నాయి, కానీ ఇపుడు తెలంగాణా ఒక రాష్ట్రంగా ఏర్పాటు అయింది కాబట్టి తమను కూడా చేర్చి నాలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ చేయమని అంటోంది. అయితే దీనిని మహారాష్ట్ర కర్ణాటక రెండూ వ్యతిరేకిస్తున్నాయి. ఇక విభజన తరువాత చూస్తే క్రిష్ణా జలాల వాటాలో ఏపీకి 66 శాతం, తెలంగాణాకు 34 శాతం వాటాను ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిని చెరి యాభై శాతం కావాలని తెలంగాణా డిమాండ్ పెడుతోంది. మరో వైపు శ్రీశైలం జలాశయంలో తెలంగాణా విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని ఎక్కువగా వినియోగిస్తోంది అని దీని వల్ల ఏపీలో సాగునీటి అవసరాలకు ఇబ్బంది అవౌతోంది అన్నది ఏపీ వాదనగా ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల విషయంలో ఏపీ తెలంగాణా ఎపుడు ఎలా ఎంత నీటిని వాడుకోవాలి అన్న దాని మీద ఈ రోజుకీ ఒక పరిష్కారం అయితే లేదు, వివాదాలు మాత్రం అలాగే జరుగుతున్నాయి.

**అనుమానాలతోనే :** ఇక ఏపీ పట్టిసీమ పులిచింతల వంటి ప్రాజెక్టుల ద్వారా తమకు రావాల్సిన దాని కంటే ఎక్కువ నీటిని మళ్ళించుకుంటోంది అని తెలంగాణా వైపు నుంచి అనుమానాలు అభ్యంతరాలు ఉన్నాయి. అయితే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీం తో తెలంగాణా నీటిని ఎక్కువగా వాడుకుంటోంది అన్నది ఏపీ వైపు నుంచి ఉన్న ఆరోపణ. ఇలా ఆరోపణలు అటూ ఇటూ ఉన్నాయి. ఇవన్నీ క్రిష్ణా జలాల మీద గొడవలు అయితే గోదావరి విషయం చూస్తే ఏపీకి 65 శాతం, తెలంగాణాకు 35 శాతం నీటి వాటాలుగా నిర్ణయించారు. గోదావరి మీద ఏపీ పోలవరం ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. అయితే దీని వల్ల తమ రాష్ట్రంలో ముంపు ప్రాంతాలు పెరుగుతాయని తెలంగాణా విమర్శలు చేస్తోంది. అయితే ఇది జాతీయ ప్రాజెక్ట్ అని కేంద్రమే నిర్మిస్తోంది అని ఏపీ దానిని తిప్పికొడుతోంది.

**బనకచర్ల మ్యాటర్ :** ఇక గోదావరి నీటిని క్రిష్ణాకు మళ్ళిస్తూ బనకచర్ల ప్రాజెక్ట్ ని ఏపీ నిర్మిస్తోందని తెలంగాణా మరో అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇక దీని మీద కూడా పంచాయతీలు ఢిల్లీ దాకా నడిచాయి. దాంతో ఏపీ అనేక సవరణలు చేసి నల్లమల సాగర్ గా పేరు మార్చి కేంద్రానికి కొత్త డీపీఆర్ ని పంపించింది. అయితే దాని మీద కూడా తెలంగాణా తీవ్ర అభ్యతరం వ్యక్తం చేస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 1480 టీఎంసీల నీళ్ళు మాత్రమే అనుమతి ఉందని అయితే అంతకంటే ఎక్కువగా ఏపీ నీటిని మళ్ళిస్తోందని తెలంగాణా ఆరోపిస్తోంది. ఇలా రాష్ట్రాల మధ్య తలెత్తుతున్న వివాదాల మధ్య కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కీలక ప్రాజెక్టులు నిలిచి పోతున్నాయ్. మరో వైపు చూస్తే ప్రజలు రైతులు సాగు తాగు నీటి హక్కుని కోల్పోతున్నారు. ఇక కోర్టులలో కేసులు గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి స్టేలు తీసుకుని రావడం వల్ల ప్రాజెక్టుల నిర్మాణాలకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. దాంతో అంచనా వ్యయం కూడా ఏ ఏటికి ఏ ఏడు బాగా పెరిగిపోతోంది.

**కేంద్రం కమిటీలతో :** అయితే కేంద్రం పెద్దన్నగా కమిటీలు ఏర్పాటు చేసినా రెండు రాష్ట్రాల సీఎంలను కీలక అధికారులను కూర్చోబెట్టి చర్చించినా కూడా ఈ జల జగడాలు ఒక కొలిక్కి అయితే రావడం లేదు అని అంటున్నారు. తాజాగా చూస్తే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ రెండు రాష్ట్రాల నదీ జలాల విషయంలో పాలనా పరంగా సాంకేతికపరంగా వివాదాలను పరిష్కరించాలని పూనుకుని ఒక కమిటీని అయితే ఏర్పాటు చేసింది. ఉన్నత స్థాయి కమిటీగా ఇది ఉండనుంది. 2025 జూలైలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల సీఎంల సమావేశం తరువాత కేంద్రం ఈ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా జల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది. ఈ కమిటీకి సీ డబ్ల్యూ సీ చైర్మన్ అధ్యక్షత వహిస్తారని అధికారికంగా ఉత్తర్వులు కూడా కేంద్రం జారీ చేసింది. ఈ కమిటీలో గోదావరి కృష్ణా రివర్ కమిటీల చైర్మన్లు అలాగే జాతీయ స్థాయిలోని వాటర్ డెవలప్మెంట్ ఏజెన్సీలు చీఫ్ ఇంజనీరు సీ డబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ కూడా ఇందులో సభ్యులుగా ఉంటారు. అంతే కాదు తెలంగాణా ఏపీ నుంచి చెరి నలుగురు వంతున అధికారులు కూడా ఈ కమిటీలో ఉంటారు. వివాదాస్పద ప్రాజెక్టులు నీటి పంపకాల విషయంలో ఈ కమిటీ ఇచ్చే నివేదిక జల వివాదాలకు పూర్తిగా ముగింపు పలుకుతుందని అంటున్నారు.

**రాజకీయ సెంటిమెంట్లు :** అయితే రాజకీయంగా సెంటిమెంట్లు జల జగడాల మధ్యన ఉన్నాయి. దాంతో కేంద్ర కమిటీ పరిష్కరించే విషయాలు రాజకీయంగా ఉన్న వివాదాలను సెంటిమెంట్లను ఏ మేరకు అధిగమించి ఒక కొలిక్కి తేగలవు అన్నదే ఇపుడు ప్రధాన చర్చగా ఉంది. ఏది ఏమైనా కేంద్రం జోక్యంతో ఈ జల వివాదాలు పూర్తిగా సమసిపోవాలని అంతా కోరుకుంటున్నారు.

# చీపురుపల్లిలో బొత్సపై పైచేయి..

## ఏం జరిగింది?



చీపురుపల్లి పట్టణాన్ని రెండుగా చీల్చే ఈ వంతెన నిర్మాణంపై గత ప్రభుత్వంలో పెద్దగా శ్రద్ధ పెట్టలేదని విమర్శలు చేస్తున్నారు. చీపురుపల్లిలో బొత్సపై పైచేయి.. ఏం జరిగింది? వైసీపీ మాజీ మంత్రి, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణపై కూటమి ప్రభుత్వం పైచేయి సాధించేలా ప్రచారం చేస్తోంది. బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో నిర్మాణం పూర్తయిన రైల్వే ఓవర్ బ్రిడ్జిపై కూటమి ప్రభుత్వం చేస్తున్న హంగామాపై విస్తృత చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు కీలకమైన చీపురుపల్లి ఆర్వోబీని వైసీపీ అధికారంలో ఉండగా, మొదలుపెట్టారు. అయితే నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా దాదాపు ఐదేళ్లుగా పనులు సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలకు పనులు పూర్తికావడంతో ఆ క్రెడిట్ తమదేనంటూ ప్రచారం చేసుకుంటోంది. ఈ విషయంలో బొత్స అనుచరులు ప్రభుత్వ హంగామాను జీర్ణించుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని బొత్స దృష్టికి తీసువెళ్లినట్లు చెబుతున్నారు. విశాఖ-పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉంటుంది. 60 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో 2022లో రాకపోకలను నిలిపివేశారు. దీనివల్ల శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పది అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ప్రధాన రహదారి మార్గాన్ని కోల్పోయినట్లైంది. విజయవాడ నుంచి విశాఖ వరకు నాలుగైదు గంటల్లో వచ్చే ఆయా ప్రాంతాల వారు... విశాఖ నుంచి స్వస్థలాలకు వెళ్లడానికి అంతే సమయం పడటంతో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేవలం రెండు గంటల్లో గమ్యస్థానాలకు వెళ్లాల్సిన వారు, చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం కారణంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిరావడంతో అదనంగా మరో రెండు మూడు గంటలు ప్రయాణం చేయాల్సివచ్చేది. చీపురుపల్లి పట్టణాన్ని రెండుగా చీల్చే ఈ వంతెన నిర్మాణంపై గత ప్రభుత్వంలో పెద్దగా శ్రద్ధ పెట్టలేదని విమర్శలు చేస్తున్నారు. అప్పట్లో బొత్స మంత్రిగా ఉండగా, చీపురుపల్లికే చెందిన బెల్లాన చంద్రశేఖర్ ఎంపీగా ఉండేవారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే రూ.14 కోట్లు మంజూరు చేసింది. చీపురుపల్లి పట్టణంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై వివాదం కారణంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం పనులను త్వరగతిన పూర్తి చేసేలా కాంట్రాక్టరును ఒత్తిడి చేయలేకపోయిందని అంటున్నారు. రైల్వే వంతెన నిర్మాణానికి నిధులు ఇచ్చినా, అప్రోచ్ రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాల్సి ఉండటం కూడా వైసీపీకి చెందిన నేతలు వెనక్కి తగ్గేలా చేసిందని అంటున్నారు. ఇలా నిర్మాణం జాప్యం కావడం వల్ల చీపురుపల్లి, పాలకొండ, రాజాం, బొబ్బిలి, పార్వతీపురం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకర్గాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సివచ్చిందని చెబుతున్నారు. ఎంతో ప్రధానమైన బ్రిడ్జిని కేవలం ఏడాదిలోగానే పూర్తిచేయాల్సివుంది. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయకపోవడంతో కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్లు పని చేయడం వల్ల నిర్మాణం పూర్తి కాడానికి దాదాపుగా ఐదేళ్లు సమయం పట్టిందని అంటున్నారు. ఈ నెల 10న బ్రిడ్జి ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించారు. అయితే ఈ అవకాశాన్ని కూటమి ప్రభుత్వం చక్కగా వినియోగించుకుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల తర్వాత పనులు పరుగులు పెట్టించి ప్రధానమైన రైల్వే వంతెనను పూర్తి చేయగలిగామని చాటుకుంటుంది. దాదాపు మూడేళ్లు జాప్యం జరగడం వల్ల ఈ విషయంలో ప్రభుత్వ ప్రచారాన్ని వైసీపీ అడ్డుకోలేకపోతోందని అంటున్నారు. బ్రిడ్జి నిర్మాణం తమ గొప్పగా కూటమి నేతలు చెప్పుకుంటోంది. బొత్స సొంత నియోజకవర్గంలో చిన్న బ్రిడ్జి పూర్తి చేయించలేకపోయారంటూ విమర్శలు గుప్పిస్తోంది. అప్రోచ్ రోడ్డుకు నిధులు విడుదల చేయించలేకపోయారంటూ బొత్సను ఇరుకన పెడుతున్నారు. అయితే కూటమి విమర్శలపై తగిన సమాధానం లేక వైసీపీ నేతలు కూడా ఈ విషయంలో ఎలాంటి ప్రకటనలు చేయలేకపోతున్నారని అంటున్నారు.



### అక్రిడేషన్స్ మంజూరు ప్రక్రియలో

# చిన్న,పెద్ద పత్రికల వ్యత్యాసం చూపరాదు

**జర్నలిస్టులకు గౌరవ వేతనం ఇవ్వాలి - జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి - జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి**
**జే.డి.ఆర్.ఎఫ్. జోనల్ కార్యాలయం ప్రారంభోత్సవ సభలో వక్తలు పిలుపు**










**రాజమహేంద్రవరం రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** అక్రిడేషన్స్ మంజూరు చేసే ప్రక్రియలో ప్రభుత్వం చిన్న,పెద్ద పత్రికల వ్యత్యాసం చూపరాదు,. జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జే.డి.ఆర్.ఎఫ్.(జర్నలిస్ట్ డెమొక్రటిక్ రైట్స్ ఫారం ) అధ్యక్షులు పూలతోట కృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బుర్రిలంక గ్రామం, గోకుల్ నర్సరీ ప్రాంగణంలో జే.డి.ఆర్.ఎఫ్. జోనల్ కార్యాలయాన్ని రాష్ట్ర నేతలు చేతులమీదుగా ప్రారంభించారు. ముందుగా బుర్రిలంక గ్రామంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జోనల్ కార్యాలయానికి చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడిఆర్ఎఫ్ అధ్యక్షులు, ప్రజా కాంక్ష దినపత్రిక ఎండి పూల తోట కృష్ణ, ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కేత శ్రీనివాసరావు, విశిష్ట అతిధిగా జెడిఆర్ఎఫ్ కార్యదర్శి బేతాళ సుదర్శనం, జెడిఎఫ్ ఉపాధ్యక్షులు, ప్రజాకాంక్ష చీఫ్ బ్యూరో జనపిరెడ్డి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపిశెట్టి రామచంద్రుడు, జోనల్ ఉపాధ్యక్షులు దండు బోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అక్రిడేషన్స్ మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అంటూ వ్యత్యాసం చూపడం తగదని అన్నారు. కార్పొరేట్ శక్తులు జర్నలిస్టులను బలి పశువులుగా చేస్తుందని విమర్శించారు. భారత రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడుతున్న జర్నలిస్టులకు జీతాలు లేవని, మిగిలిన మూడు రంగాలకు జీతభత్యాలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులను పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఆర్థిక ఇబ్బందులు తొలగించే చర్యలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్ లకు, పూజారులకు, పాస్టర్లకు ఇస్తున్నట్లే అర్హులైన జర్నలిస్టులకు రూ 18 వేల రూపాయలు గౌరవ వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికల మనుగడ కోసం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సభ్యుల, భద్రత సంక్షమమే ముఖ్యంగా జెడిఆర్ఎఫ్ ఏర్పడిందని అన్నారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా జే డి ఆర్ ఎఫ్ ముందుండి ఆదుకుంటుందని వివరించారు.

**ఈ సందర్భంగా సభలో కొన్ని తీర్మానాలను ఆమోదించారు**

అర్హత గల విలేకరులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని.

జర్నలిస్ట్, వారి కుటుంబాలకు ఆరోగ్య భద్రతకు రూ.10 లక్షలకు తక్కువకాని విధంగా కార్పొరేట్ వైద్య సేవలకై ఉచిత హెల్త్ కార్డులు జారీ చేయాలని.

విలేకరులు వారి కుటుంబ భద్రతకై ప్రత్యేక భద్రత చట్టాలు రూపొందించి అమలుపరచాలని.

విలేకరుల భద్రతకై వారి సంక్షమం కొరకు జర్నలిస్ట్ కార్పొరేషన్ ను 100 కోట్ల తో ఏర్పాటు చేయాలి. 5. తగు విఖితపూర్వక, శాస్త్రీయపరమైన ఆధారాలతోనే విలేకరులపై చట్టపరమైన విచారణకు ఆదేశించాలని.

విలేకరులపై తప్పుడు ఆరోపణలతో అక్రమ కేసులు బనాయించే అధికారులపై కాలయాపన లేని చర్యలు చేపట్టాలని.

మూడేళ్ల అనుభవం గల విలేకరులను ప్రభుత్వం గుర్తించి రూ. 5 వేలు కు తక్కువకాని విధంగా సైఫండ్ చెల్లించాలని.

ఐదేళ్ల అనుభవం గల విలేకరులకు ఉచితంగా గృహాలు మంజూరు చేయాలని.

విలేకరుల పిల్లల చదువుల కోసం కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50% ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక జీవో విడుదల చేయాలని.

విలేకరుల కార్పొరేషన్ ద్వారా న్యూస్ ప్రింట్ ను ఉచిత సరఫరాతో పాటు ఉచిత విద్యుత్తును అమలు చేయాలని.

స్త్రీ విలేకరుల సంక్షమం కోసం 100 కోట్లతో విలేకరుల కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని.

వార్తా సేకరణలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు భద్రతతో గల ప్రత్యేక సౌకర్యాలు అమలు చేసే విధంగా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని.

ఉచితంగా టోల్ ప్లాజా రుసుం సౌకర్యం కల్పించాలని.

55 ఏళ్ల దాటిన సీనియర్ జర్నలిస్టులకు రూ. 5 వేలు కు తక్కువ కాకుండా పెన్షన్ అమలు చేయాలని.

చిన్నపత్రికల యాజమాన్యం పైన, విలేకరుల పైన అధికార పక్షలు ఇతర రాజకీయపక్షలు దాడులు, దౌర్జన్యాలపై ప్రత్యేక రక్షణ కల్పించాలని.

విలేకరుల నిబద్ధతగల వృత్తి సేవలపై ప్రభుత్వం నుండి ప్రత్యేక గుర్తింపు తో పాటుగా ఆర్థిక సహాయం అందించాలని.

ఇన్వెస్టిగేటెడ్ జర్నలిస్టు సేవలను ప్రభుత్వం ప్రోత్సాహంతో వారి సేవలను వినియోగించుకోవాలని.

పత్రిక యాజమాన్యం కోరిన వెంటనే కాలయాపన లేని విధంగా వివిపిల ఆపాయింట్మెంట్ కేటాయించాలని.

విలేకరుల కోసం ప్రతి జిల్లాకు ఒక డిపార్ట్మెంటల్ స్టోర్ ను ఏర్పాటు చేయాలని.

అర్హత గల విలేకరులకు లక్షరూపాయలకు తక్కువ కాకుండా ఏ విధమైన గ్యారంటీ లేని రుణం 25పైసలకే వడ్డీకే అందించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జె.డి.ఆర్.ఎఫ్. జిల్లా అధ్యక్షుడు మారంపూడి సోమరాజు,ఉపాధ్యక్షులు గొర్రెల రాజు, యార్లగడ్డ నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుడెల్లి రత్న కిషోర్,ప్రచార కార్యదర్శి గిరీష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ సనమండ్ర లాజర్, సిర్రా చిట్టిబాబు, మీడియా కోఆర్డినేటర్ ఎం.వీ.ఎస్. రమేష్, ట్రెజరర్ పిచ్చుక మహేష్, కత్తి శ్రీనివాస్, చల్లా విజయభాలానంద, రాఘవేంద్ర, నజీర్, యాకూబ్, నాగరాజు, సోమశేఖర్, ఆర్వివి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### మీకోసం పిజిఆర్ఎస్ వేదికతో పాటు

# భూమి సమస్యలకు రెవెన్యూ క్లినిక్

**భూమి సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కార వేదిక**
**జిల్లా కలెక్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) వై.మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పి జి ఆర్ ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమంతో పాటు, భూమి సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ ను జనవరి 5న నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ క్లినిక్‌ను జనవరి 5 (సోమవారం) రోజున రాజమహేంద్రవరం తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో,ఈ కార్యక్రమంతో పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు (మండపేట నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల తహశీల్దార్లు) రాజమహేంద్రవరం మరియు కొవ్వూరు డివిజన్ల రెవెన్యూ డివిజనల్ అధికారులు జనవరి 5 ఉదయం 9.30 గంటలకు హాజరవుతారని తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌కు హాజరయ్యే అధికారులు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అవసరమైన రెవెన్యూ రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో'మీకోసం' జనవరి 5 (సోమవారం) రోజున జిల్లా కలెక్టరేట్ నుండి డివిజన్, మండల, మున్సిపల్, గ్రామ, వార్డు సచివాలయాల వరకు 'మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత డిప్యూటీ తహశీల్దార్ / రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్‌లు మండల స్థాయిలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదు చేసిన అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ ఉ 'మన మిత్రా' యాప్ ద్వారా పౌర సేవలు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందించేందుకు 9552300009 వాట్సప్ నంబర్ ద్వారా అందుబాటులో ఉన్న 'మన మిత్రా' యాప్ ద్వారా 36 ప్రభుత్వ శాఖలకు చెందిన 700కు పైగా పౌర సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన జలా కోరారు.

### ఆటో డ్రైవర్లకు ప్రమాద భీమా పాలసీ

# హామీ ఇచ్చిన గోరంట్ల రవిరామ్ కిరణ్




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం శాటిలైట్ సిటీ గ్రామ శ్రీలక్ష్మ గణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధి గా టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్ కిరణ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ ఆటో యూనియన్ ఓనర్స్ మరియు వర్కర్స్ అసోసియేషన్ ప్రతీ ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలలో ప్రతీ ఒక్కటీ అమలు చేసుకుంటూ వస్తుంది అని ఇచ్చిన హామీలలో భాగంగా వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు గత అక్టోబర్ నెలలో 2.90 లక్షల మందికి 15 వేల రూపాయలు, ఖతాలలో 435 కొట్లు జమ చేసారని తెలిపారు నూతన సంవత్సరం నుండి ప్రతీ ఒక్కరికి మంచి జరగాలని రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం జి ఎస్ ఆర్ ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని అన్నారు.ఆటో యూనియన్ లో ఉన్న ప్రతీ ఒక్కరికి ఇన్సూరెన్స్ కట్టే బాధ్యత తీసుకుంటానని రవిరామ్ కిరణ్ తెలియజేసారు. అనంతరం ఆటో యూనియన్ సభ్యులు రవిరామ్ కిరణ్ కి పూల మాలలు వేసి శాలువతో సత్కరించి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, ఓనర్లు, డ్రైవర్లు, వర్కర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

### అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన

# లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

**ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంధుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం లిపిని కనిపెట్టిన మహాజ్ఞాని లూయిస్ బ్రెయిలీ జయంతి, ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఎన్ కృష్ణ సింధూరి ఆర్థిక సహకారంతో ఆదివారం స్థానిక జియాన్ అంధుల పాఠశాలలోని జిల్లా మేనేజింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, కోశాధికారి డాక్టర్ జీ మహాలక్ష్మ ల చేతుల మీదుగా విద్యార్థులకు పండ్లు,టవల్స్,స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కేవీ రమమ మాట్లాడుతూ ప్రపంచంలోని అంధులకు తన మేధాశక్తితో జ్ఞానకవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. మేనేజింగ్ కమిటీ కోశాధికారి డాక్టర్ జీ మహాలక్ష్మ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ గురించి వివరించారు. బ్రెయిలీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ ఎమ్ ఏ బేగ్, బళ్ళా శ్రీనివాస రావు,బోను రామకృష్ణ, ఎమ్ పద్మావతి, నూర్, జిల్లా కో ఆర్డినేటర్ రాంబాబు,పద్మ తదితరులు పాల్గొన్నారు.

### బదిరెడ్డి వారి ఆధ్వర్యంలో

# ఘనంగా ముగ్గుల పోటీలు

**స్వర్గీయ నాగేశ్వరరావు 76వ జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవ కమిటీ నాయకులు స్వర్గీయ బదిరెడ్డి నాగేశ్వరరావు (దొర) జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు జనసేన పార్టీ మండల గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి రామతులసి దొర తెలిపారు. ఆదివారం బదిరెడ్డి నాగేశ్వరరావు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం ఎదుటి వీధిలో పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వయస్సు తారతమ్యం లేకుండా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి నాగుబండి నాగలక్ష్మ, ద్వితీయ బహుమతి తనకాల భవ్య శ్రీ, తృతీయ బహుమతి బడగళ్లపాటి జ్యోతిర్మయి, మూడు, నాలుగు స్థానాల్లో విజేతలు ముగ్గురు చొప్పున నిర్వాహకులు బదిరెడ్డి రామతులసి దొర, సర్పంచ్ కర్రి లక్ష్మసరోజి గణేష్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక బహుమతితో పాటు డ్రా లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అపర్ణ ఏజెన్సీస్, కోకోకోలా, భువన బ్యూటీ పార్లర్, సర్వ వన్ గ్రామ్ గోల్డ్ అధినేతలు విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. నేడు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్వర్గీయ బదిరెడ్డి నాగేశ్వరరావు 76వ జయంతి వేడుకలు తన స్వగృహంలో ఘనంగా జరగనున్నట్లు బదిరెడ్డి రామతులసి దొర దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీను, గరగ శ్రీధర్, చిట్టిబాబు, బడగళ్లపాటి శ్రీనివాస్, కృష్ణవేణి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి సిటీ వాతావరణ కాలుష్య పరిస్థితి ఏమిటి..?

**కాలుష్య నియంత్రణకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు శూన్యం : మాజీ ఎంపీ మార్గాని భరత్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాలుష్య నియంత్రణపై కూటమి ప్రభుత్వం చర్యలు ఏమి చేపట్టిందని నిప్పులు చెరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్ సహజంగా మనం వాతావరణ కాలుష్యం గురించి మాట్లాడుకున్నప్పుడు భారతదేశంలో ముఖ్యంగా వినిపించేది ఢిల్లీ మహానగరం ఎందుకంటే అక్కడ పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు వాటి నుంచి వచ్చే కాలుష్యం వలన అక్కడి గాలి నాణ్యత సూచిక సుమారు 230 నుండి 250 వరకు ఉంటుంది చుట్టుపక్కల ఉన్న హర్యానా, చండీగర్, పంజాబ్,ఉత్తర ప్రదేశ్ తదితర ప్రాంతాల్లో వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉంటుంది ఎందుకంటే అక్కడ పండించిన పంటలు వరి గోధుమ తదితర పంటలు పూర్తయిన తర్వాత వాటిని కాల్చడం వలన వచ్చే ఆ పొగ వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. మన రాజమండ్రి నగరం గురించి మాట్లాడుకుంటే ఇవాళ ఉదయం 11 గంటలకు గాలి నాణ్యత సూచిక ప్రకారం 234 సూచిస్తుంది, ఇప్పుడు గాలి నాణ్యత సూచిక ప్రకారం 187 సూచిస్తుంది. గాలి నాణ్యత సూచిక ప్రకారం 0 నుండి 50 వరకు ఉంటే మంచిదని, 50 నుండి 100 వరకు ఉంటే మితంగా ఉందని, 100 నుండి 150 వరకు ఉంటే పూర్ గా ఉందని, 150 నుండి 200 వరకు ఉంటే అనారోగ్యకరంగా ఉన్నదని, 250 పైన ఉంటే ప్రమాదకరంగా ఉన్నదని ఈ సూచిక తెలియపరుస్తుంది. అంటే మన రాజమండ్రి సిటీ కాలుష్య తీవ్రత అనారోగ్యకరం నుండి ప్రమాదకరం మధ్యలో ఉన్నది. గతంలో మన నగరంలో కాలుష్య తీవ్రత సున్నా నుంచి 50 మధ్యలో ఉన్న పరిస్థితులు ఉండేవి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నవంబర్ 24 వ తారీకు 2021 వ సంవత్సరం కాలుష్య రహిత ఉత్తమ పది నగరాల వెలువరించిన జాబితాలో మన రాజమండ్రి సిటీ గాలి నాణ్యత సూచిక 29 తో ఆరవ స్థానంలో నిలిచింది. కానీ ఇప్పుడు పరిస్థితి తీవ్రతరం అవుతుంది దీనికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యం గతం లో జగన్ ప్రభుత్వంలో మన రాజమండ్రి నగరం ఎంత సుందరంగా ఉండేది ఎన్ని వేల మొక్కలను నటించాను, అంత ఎందుకు యువత హరిత పేరిట కొన్ని వేల మొక్కలను నగరం అంతా విద్యార్థుల సహాయ సహకారాలతో నాటించడం జరిగింది అవి ఈరోజు కొన్నిచోట్ల వృక్షలుగా కూడా మారాయి కానీ కొన్నిచోట్ల పబ్లిసిటీ పిచ్చితో ఆ మొక్కల మధ్యలో ఊసలను గుచ్చడం మొక్కలను పెకిలించడం వంటి అనారోగ్యకరమైన చర్యలు లోకేష్ పర్యటన సందర్భముగా ఈ కూటమీ ప్రభుత్వం చేసింది. ఇప్పటికే ఈ కాలుష్యం తీవ్రత ఇంత ప్రమాదకరంగా ఉంటే రాబోయే రోజులలో గోదావరి పుష్కరాలు రానున్నాయి కొన్ని కోట్ల మంది ప్రజలు ఇక్కడికి రావడం జరుగుతుంది అప్పటికి పరిస్థితి ఎంత ఘోరాతి ఘోరంగా మారనుందో మన ఊహలకే అందటం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని ఈ కాలుష్య నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున, ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను.

# ప్రకృతి ఆరాధన సనాతన ధర్మంలో ఒక భాగం

**హిందూ సమ్మేళనంలో పరవస్తు శ్రీ సత్య గోపీనాథ్ దాస్ ప్రభుజి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి ఆరాధన సనాతన ధర్మంలో ఒక భాగం, పుణ్య నదుల్లో స్నానం చేయడం, ఆరాధించడం వలన అనుగ్రహం పుణ్యఫలం లభిస్తుందని ఇస్కాన్ ప్రభుజి శ్రీపరవస్తు శ్రీ సత్య గోపీనాథ్ దాస్ అన్నారు.ఆర్ ఎస్ ఎస్ వందేళ్ల వేడుకలలో భాగంగా దేవిచౌక్ సెంటర్లో ఆదివారం రాత్రి హిందూ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రభుజి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించడం సనాతన ధర్మంలో ఒక భాగమన్నారు. ప్రకృతి బాగుంటే మనం కూడా బాగుంటామని అన్నారు. సోము మాట్లాడుతూ విదేశీ మోజు తగ్గించుకుని, స్వదేశీ భావన పెంపొందించుకోవాలని సూచించారు. దేశభక్తి భావాలను, జాతీయ భావాలను ఆర్ ఎస్ ఎస్ పెంపొందిస్తోందని వివరించారు. హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు. భజన, దేశభక్తి గీతాలు, భరతనాట్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# కాటవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం కాటవరం గ్రామంలో కీర్తిశేషులు అల్లంరాజు వెంకటేశ్వరరావు దంపతుల దివ్య ఆశీస్సులతో శ్రీ విజయ ఆయుర్వేదిక్ మరియు భాస్కర ఆయుర్వేదిక్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ప్రముఖ సినీ నటుడు పుష్ప సురేష్ శర్మచే ప్రారంభించబడింది.ప్రముఖ ఆయుర్వేద కంపెనీల సహాయ సహకారాలతో ఉచిత ఆయుర్వేద మందులతో పాటు షుగర్,బి.పి, బి ఎండి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరిగింది.ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో పలు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో పేషెంట్ లు వచ్చి మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. వెంకటేశ్వర ప్రసాద్, డాక్టర్ ఆర్. వెంకటరమణ, డాక్టర్ భాస్కరరావు డాక్టర్ ఎ. పాపారావు, డాక్టర్ విశ్వనాథ శర్మ,శ్రీ హర్ష, పవన్, పలు ఆయుర్వేద సంస్థల ప్రముఖులు పాల్గొన్నారు.

# సీతానగరంలో ఉద్యోగ మేళా




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీ మంగళవారం 10 గంటలకు భారీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిట్టిబాబు తెలిపారు.టాటా ఎలక్ట్రానిక్స్, డక్కన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంక్, ఐటిసి, ఇసుజు మోటార్స్ మరియు హ్యుందాయ్ వంటి కంపెనీలు పాల్గొంతున్నాయని 10 వ తరగతి, ఇంటర్,డిగ్రీ,బి.టెక్, ఐటిఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

# ట్రైలర్ వచ్చేసింది..

# మన శంకరవరప్రసాద్ గారు కుమ్మేశారు..




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న న శంకర వరప్రసాద్ గారు సినిమాకు మెగా కౌంట్ డౌన్ స్టార్ట్ అయిపోయింది. మరో తొమ్మిది రోజుల్లో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు సాంగ్స్, పోస్టర్స్ తో సినిమాపై ఆసక్తి కలిగిస్తూ వచ్చిన రావిపూడి.. మరికొన్ని గంటల్లో మెయిన్ ప్రమోషనల్ కంటెంట్ చూపించబోతున్నారు. ట్రైలర్ వచ్చేసింది.. మన శంకరవరప్రసాద్ గారు కుమ్మేశారు.. సంక్రాంతికి బ్లాక్ బస్టరే.. మోస్ట్ అవైటెడ్ సినిమా మన శంకరవరప్రసాద్ గారు. సూపర్ హిట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తోన్న ఈ పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ మూవీలో విక్టరీ వెంకటేశ్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో తన స్టైల్లో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. మొదటి నుంచి విభిన్న కంటెంట్లతో వీడియోస్ షేర్ చేస్తున్న డైరెక్టర్.. ఇప్పుడు మెయిన్ ప్రమోషనల్ కంటెంట్ చూపించేశారు. అదేమనండి. మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ రిలీజ్ చేశారు. ఆదివారం సాయంత్రం తిరుపతిలోని ఎస్వీ సినీప్లెక్స్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగానే ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది చిత్రయూనిట్. తాజాగా విడుదలైన ట్రైలర్ అదిరిపోయింది. వింటేజ్ చిరు కామెడీ టైమింగ్.. అనిల్ రావిపూడి డైరెక్షన్ గురించి చెప్పక్కర్లేదు. ఇక సోమవారం నుంచి ప్రమోషన్స్ వేగం పెంచనున్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. జనవరి 5న నెల్లూరిలో సెలబ్రేషన్స్ చేయనున్నారు. అలాగే 6న విశాఖపట్నం, 7న హైదరాబాద్, 8న తాడేపల్లిగూడెం, 9న అనంతపూర్, 10న వరంగల్, 11న బెంగళూరు ఇలా వరుసగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## టాలీవుడ్ చందమామ అందం సీక్రెట్ ఇదే..

### 40 ఏళ్ల వయసులో కాజల్ స్టన్నింగ్ లుక్స్..



ముట్టుకుంటే కందిపోయే అందం.. వెన్నెలమ్మలాంటి సోయగంతో కట్టిపడేస్తుంది హీరోయిన్ కాజల్ అగర్వాల్. చందమామలాంటి మోముతో చూడముచ్చటగా ఉంటుంది ఈ వయ్యారి. పెళ్లితో హీరోయిన్ల కథ కంచికే అనుకుంటారు. కానీ అందం విషయంలో అన్ని రూల్స్ బ్రేక్ చేసింది హీరోయిన్ కాజల్. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకున్నాయి. టాలీవుడ్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. లక్ష్మ కళ్యాణం సినిమాతో అడుగుపెట్టి.. చందమామ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది ఈ బ్యూటీ. పెళ్లి తర్వాత సినిమాలు తగ్గించింది ఈ అందాలు ముద్దుగుమ్మ. టాలీవుడ్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. లక్ష్మ కళ్యాణం సినిమాతో అడుగుపెట్టి.. చందమామ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది ఈ బ్యూటీ. పెళ్లి తర్వాత సినిమాలు తగ్గించింది ఈ అందాలు ముద్దుగుమ్మ. కానీ అందం, ఫిట్‌నెస్ విషయంలో మాత్రం తగ్గేదేలే అంటుంది. ప్రస్తుతం ఆమె వయసు 40 సంవత్సరాలు. ఈ వయసులోనూ ఏమాత్రం తరగని అందంతో కట్టిపడేస్తుంది. తాజాగా బ్లాక్ డ్రెస్ లో సిండ్రెల్లా మెరిచింది కాజల్. అలాగే తన అందానికి, ఫిట్‌నెస్ సీక్రెట్స్ రివీల్ చేసింది. కానీ అందం, ఫిట్‌నెస్ విషయంలో మాత్రం తగ్గేదేలే అంటుంది. ప్రస్తుతం ఆమె వయసు 40 సంవత్సరాలు. ఈ వయసులోనూ ఏమాత్రం తరగని అందంతో కట్టిపడేస్తుంది. తాజాగా బ్లాక్ డ్రెస్ లో సిండ్రెల్లా మెరిచింది కాజల్. అలాగే తన అందానికి, ఫిట్‌నెస్ సీక్రెట్స్ రివీల్ చేసింది. కాజల్ తప్పనిసరిగా మాయిశ్చరైజింగ్, సన్ స్క్రీన్, హైడ్రేషన్ నైట్ సీరమ్స్ వాడతానని తెలిపింది. అవి తన చర్మాన్ని ప్రశాశవంతంగా మారుస్తాయట. స్కిన్ గ్లో కోసం ప్రత్యేకమైన కేర్ తీసుకుంటానని అంటుంది ఈ వయ్యారి. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ వ్యాయమాలు, యోగా వర్కవుట్స్ చేస్తుందట. కాజల్ తప్పనిసరిగా మాయిశ్చరైజింగ్, సన్ స్క్రీన్, హైడ్రేషన్ నైట్ సీరమ్స్ వాడతానని తెలిపింది. అవి తన చర్మాన్ని ప్రశాశవంతంగా మారుస్తాయట. స్కిన్ గ్లో కోసం ప్రత్యేకమైన కేర్ తీసుకుంటానని అంటుంది ఈ వయ్యారి. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ వ్యాయమాలు, యోగా వర్కవుట్స్ చేస్తుందట. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ యోగా, వర్కవుట్స్ అసలు స్కిప్ చేయనని అంటుంది. అలాగే రోజూ శరీరానికి అవసరమైన వర్కవుట్స్ మాత్రం చేస్తుందట. అలాగే ప్రతి రోజూ 40 నిమిషాల పాటు పైలెట్స్ చేసేలా లక్ష్యం పెట్టుకుంటానని అంటుంది. తాజా పండ్లు, ఆకుకూరలు తీసుకుంటుంది. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ యోగా, వర్కవుట్స్ అసలు స్కిప్ చేయనని అంటుంది. అలాగే రోజూ శరీరానికి అవసరమైన వర్కవుట్స్ మాత్రం చేస్తుందట. అలాగే ప్రతి రోజూ 40 నిమిషాల పాటు పైలెట్స్ చేసేలా లక్ష్యం పెట్టుకుంటానని అంటుంది.

# ఈ ముగ్గురు ఆటగాళ్లకు అర్హతే లేదు.. కట్‌చేస్తే..

### కోచ్ గంభీర్ దయతో భారత జట్టులోకి రీఎంట్రీ..!



న్యూజిలాండ్ జట్టుతో వన్డే సిరీస్‌కు భారత జట్టు సిద్ధమైంది. ఈ క్రమంలో బీసీసీఐ 15మంది ప్లేయర్లతో కూడిన జట్టును ప్రకటించింది. అయితే, ఈ స్క్వాడ్‌లో కొన్ని షాకింగ్ పేర్లు కనిపించాయి. ముఖ్యంగా ముగ్గురు ప్లేయర్ల ఎంపికపై విమర్శలు వినిపిస్తున్నాయి. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్ కోసం సెలెక్టర్లు జనవరి 3న భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించాడు. గిల్ ప్రస్తుతం ప్లీహము గాయం నుంచి కోలుకుంటున్నాడు. అయితే అతని పేరు పక్కన 'స్టార్ణ గుర్తు ఉంది. అంటే బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతనికి ఇంకా గ్రీన్ సిగ్నల్ లభించలేదని అర్థం. వైద్య బృందం అనుమతి ఇస్తేనే ఆయన మైదానంలోకి దిగుతాడు. అయితే, ఈ జట్టులో ఎంపికైన ముగ్గురు ఆటగాళ్లపై తీవ్ర చర్చ జరుగుతోంది. వారి ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉన్నా, కేవలం కోచ్ గౌతమ్ గంభీర్ చొరవతోనే వారికి చోటు దక్కిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ముగ్గురు ఆటగాళ్లు ఎవరో ఓసారి చూద్దాం..

1. రిషబ్ పంత్: లెఫ్ట్ హ్యాండ్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను సెలెక్టర్లు వన్డే జట్టులోకి తీసుకున్నారు. అయితే, 2025 సంవత్సరంలో పంత్‌కు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఏడాది పొడవునా అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ (2025-26)లో కూడా పంత్ పెద్దగా ప్రభావం చూపలేదు. 5 మ్యాచ్‌ల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలతో 188 పరుగులు మాత్రమే చేశాడు. అదే సమయంలో ధ్రువ్ జురెల్ (379 పరుగులు), ఇషాన్ కిషన్ (2 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీతో 146 పరుగులు) అద్భుతంగా రాణిస్తున్నా బీసీసీఐ వారిని విస్మరించింది.

2. నితీష్ కుమార్ రెడ్డి: యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి కూడా జట్టులో చోటు దక్కింది. కానీ అతని గత గణాంకాలు ఏమాత్రం ఆకట్టుకునేలా లేవు. ఇప్పటివరకు ఆడిన రెండు వన్డేల్లో నితీష్ కేవలం 27 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ఎకానమీ రేటు కూడా 7.74 గా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో కూడా 5 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క అర్థ సెంచరీ, 6 వికెట్లు మాత్రమే తీశాడు. అయినప్పటికీ సెలెక్టర్లు అతనికి వన్డే క్యాప్ ఇచ్చేందుకు మొగ్గు చూపారు.

3. ప్రసిద్ధ్ కృష్ణ: ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణపై కోచ్ గంభీర్ ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు కనిపిస్తోంది. ప్రసిద్ధ్ ఇప్పటివరకు 21 వన్డేల్లో 37 వికెట్లు తీశాడు. అతని ఎకానమీ రేటు 6.02 గా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక తరపున కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. మరోవైపు, ఇదే టోర్నమెంట్‌లో 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి ఫామ్‌లో ఉన్న మొహమ్మద్ షమీని సెలెక్టర్లు పక్కన పెట్టి ప్రసిద్ధ్‌ను ఎంచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్)లి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మొహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

# అగ్గిరాజేసిన ఆ వివాదం.. కట్‌చేస్తే..

### ఐపీఎల్ 2026పై నిషేధం..?




బంగ్లాదేశ్, భారత్ మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు ఇప్పుడు క్రీడారంగంపై, ముఖ్యంగా ఐపీఎల్ 2026 ప్రసారాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏకంగా ఐపీఎల్ 2026 ప్రసారాలను బంగ్లాదేశ్‌లో నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ 'ఇండియన్ ప్రీమియర్ లీగ్ణకి బంగ్లాదేశ్‌లో కూడా భారీగా అభిమానులు ఉన్నారు. అయితే, 2026 ఐపీఎల్ సీజన్ ప్రసారాలు బంగ్లాదేశ్‌లో నిలిచిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న రాజకీయ, దౌత్యపరమైన విభేదాలు క్రికెట్ మైదానానికి పాకడమే దీనికి ప్రధాన కారణం. ముఖ్యంగా ఐపీఎల్ నుంచి బంగ్లాదేశ్ స్టార్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్ విడుదల కావడం ఈ వివాదాన్ని మరింత రాజేసింది.

**వివాదానికి దారితీసిన పరిస్థితులు..**

1. ముస్తాఫిజుర్ రెహమాన్ విడుదల..

బీసీసీఐ ఆదేశాల మేరకు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తన స్క్వాడ్ నుంచి విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇది బంగ్లాదేశ్ క్రికెట్ అభిమానుల్లో, ఆ దేశ క్రికెట్ బోర్డులో తీవ్ర అసంతృప్తిని కలిగించింది.

2. ప్రసార హక్కులపై నీలినీడలు..

బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేసే ఛానెల్‌లపై నిషేధం విధించే ఆలోచనలో అక్కడి ప్రభుత్వం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. భారతీయ ఉత్పత్తులు, క్రీడలను బహిష్కరించాలనే డిమాండ్ అక్కడ పెరుగుతోంది. ఒకవేళ ప్రభుత్వం అధికారికంగా నిషేధం విధిస్తే, లక్షలాది మంది బంగ్లాదేశ్ క్రికెట్ ప్రేమికులు ఐపీఎల్ 2026 సీజన్‌ను వీక్షించే అవకాశాన్ని కోల్పోతారు.

3. భద్రతా పరమైన ఆందోళనలు..

భారత్‌లో జరగబోయే టీ20 ప్రపంచకప్ వేదికలను కూడా మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) ఇప్పటికే ఐసీసీని కోరింది. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత లేదని వారు వాదిస్తున్నారు. ఈ వరుస పరిణామాలు ఐపీఎల్ ప్రసారాలపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయి.

4. పాకిస్థాన్ బాటలో బంగ్లాదేశ్..?

గతంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాకిస్థాన్‌లో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేశారు. ఇప్పుడు బంగ్లాదేశ్ కూడా అదే బాటలో పయనిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం క్రీడా సంబంధాలనే కాకుండా, బ్రాడ్కాస్టర్లకు వచ్చే ఆదాయంపై కూడా దెబ్బకొట్టే అవకాశం ఉంది.

క్రీడలు ఎప్పుడూ దేశాల మధ్య వారధిలా పనిచేయాలి. కానీ ప్రస్తుతం భారత్-బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న పరిస్థితులు క్రికెట్ అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ఈ దౌత్య వివాదాలు సద్దుమణిగి, అభిమానులకు వినోదం అందుతుందని అందరూ ఆశిస్తున్నారు. ఒకవేళ ప్రసారాలపై నిషేధం విధిస్తే, అది క్రీడా స్ఫూర్తికి పెద్ద దెబ్బగానే పరిగణించవచ్చు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com